తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | ఆదివారం - 15 - ఫిబ్రవరి 2026 | సంపుటి:3 | సంచిక:258 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in

### మున్సిపల్ ఎలక్షన్స్ ట్రైలరే..

## అసలు సినిమా ఉంది

### తెలంగాణ జాగృతి చీఫ్ కవిత



**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తమ భవిష్యత్తు రాజకీయ ప్రస్థానానికి కేవలం ఒక 'ట్రైలర్' మాత్రమేనని, అసలు 'సినిమా' ముందుందని తెలంగాణ జాగృతి చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శిస్తూ, రానున్న రోజుల్లో తమ కూటమి రాష్ట్రంలో బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

మిగతా 2లో..

## వడ్డేపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డితో కౌన్సిలర్ల చర్చ

**వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో మర్యాదపూర్వక భేటీ**

**పీసీసీ అధ్యక్షుడు, మంత్రి, ఎంపీ తదితరుల హాజరు**

**ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ కు చెందిన 8 మంది కౌన్సిలర్ల సమావేశం**

2లో



# పురపోరులో పొంగులేటి మ్యాజిక్

# 70 % సక్సెస్ రేటు

### 249 వార్డుల్లో ప్రచారం – 174 చోట్ల హస్తం జెండా

### ఉమ్మడి ఖమ్మం, వరంగల్‌లో కాంగ్రెస్ ప్రభంజనం

### శీనన్న వ్యూహంతో ప్రత్యర్థుల కోటలు బద్దలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** మున్సిపల్ ఎన్నికల కురుక్షేత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అజేయ శక్తిగా నిలిచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించిన బాధ్యతను సవాలుగా తీసుకుని కేవలం పది రోజుల్లో 249 వార్డుల్లో సుడిగాలి ప్రచారం నిర్వహించారు. ఆ ప్రచార ఫలితంగా 174 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించడంతో సుమారు 70 శాతం సక్సెస్ రేటు నమోదు కావడం విశేషం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పొంగులేటి ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డుల్లో 24 చోట్ల కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో 22 స్థానాలు గెలుచుకోగా, కల్లూరులో 12, సత్తుపల్లిలో 17 వార్డులను హస్తం ఖాతాలో వేసుకున్నారు. ఇల్లందులో 19, అశ్వారావుపేటలో 17 స్థానాల్లో గెలిచి జిల్లా రాజకీయాల్లో కాంగ్రెస్ పట్టు బలపడినట్లు స్పష్టం అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా శీనన్న వ్యూహం ఫలించింది. భూపాలపల్లిలో 16 వార్డులు గెలుచుకోగా, పరకాలలో 13, స్టేషన్ ఘన్‌పూర్‌లో 13 స్థానాలు సాధించి కాంగ్రెస్ ప్రాభవాన్ని చాటింది.

మిగతా 2లో..



## హంగ్ మున్సిపాలిటీలపై సీఎం రేవంత్ రెడ్డి వ్యూహభేటీ

**మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీల్లో స్వతంత్రుల మద్దతుపై దృష్టి**

**20కిపైగా స్థానాలు 'హస్త'గతం అవుతాయని అంచనా**

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లోని మల్కాజిగిరి క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు.. తదుపరి కార్యాచరణపై చర్చించనున్నారు. ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చ జరగనుంది. వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశా నిర్దేశం చేయనున్నారు. 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలు 'హస్త'గతం అవుతాయని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది.

మిగతా 2లో..



## రేవంత్ ప్రభుత్వంపై ధర్మపురి అరవింద్ విమర్శలు

**బండి సంజయ్‌ను వారియర్‌గా అభివర్ణించిన ఎంపీ**

**కార్పొరేటర్ల ఎత్తుకెళ్లింపులపై హెచ్చరిక**

**నిజామాబాద్ ఫలితాల్లో బీజేపీ ఆధిక్యం అని వ్యాఖ్య**



**నిజామాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఎంపీ ధర్మపురి అరవింద్ రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ ఒక వారియర్ అని, ఆయన అర్జునుడి పాత్రకు సరిపోతారని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలమైన స్థాయిలో లేరని అన్నారు. మున్సిపల్ వార్డు సభ్యులు, కార్పొరేటర్లను బలవంతంగా ఎత్తుకెళ్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు.

మిగతా 2లో..

## సంగారెడ్డి ఘటనపై పోలీసు సంఘాల మౌనం

**వార్డు 34 వివాదం రాష్ట్రవ్యాప్తంగా చర్చ**

**పోలీసుల మనోబలంపై ప్రశ్నలు**

**ప్రభుత్వ స్పందనపై ప్రతిపక్షాల ఆక్షేపణ**

**ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సంగారెడ్డి వార్డు 34లో చోటుచేసుకున్న ఘటనపై రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగిన ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనలో సీసీఎస్ సీఐ శివకుమార్ యాదవ్, డీఎస్పీ సతయ్య గౌడ్ సహా పోలీసులపై దుర్భాషలాడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మిగతా 2లో..

## హైదరాబాద్ కేబీఆర్ పార్క్‌లో డాగ్ అడాప్షన్ కార్యక్రమం

**ప్రజాప్రతినిధుల ఆదర్శ దత్తత**

**వీధి కుక్కల సంరక్షణపై అవగాహన**

**జంతు ప్రేమకు నగర వాసుల స్పందన**

**హాజరైన మంత్రులు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని కేబీఆర్ నేషనల్ పార్క్‌లో శనివారం డాగ్ అడాప్షన్ కార్యక్రమం నిర్వహించారు. జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీధి కుక్కల సంరక్షణ, దత్తత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క హాజరయ్యారు. మంత్రి సురేఖ చేతుల మీదుగా సీతక్క ఒక స్వదేశీ కుక్కపిల్లను దత్తత తీసుకున్నారు. ఎంపీ రేణుక చౌదరి కూడా ఒక కుక్కపిల్లను అడాప్ట్ చేసుకుని జంతు ప్రేమకు నిదర్శనంగా నిలిచారు. ప్రజాప్రతినిధులు స్వయంగా ముందుకు రావడం కార్యక్రమానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ కుక్కలు విశ్వాసానికి ప్రతీకలని పేర్కొన్నారు.

మిగతా 2లో..

## మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు : తలసాని ఆరోపణ

**డబ్బు, మద్యం ప్రవాహంపై విమర్శలు**

**పోలీసులను అడ్డుపెట్టుకుని పాలన అంటున్న మాజీ మంత్రి**

**కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్న వ్యాఖ్య**



**సిద్దిపేట, 14 ఫిబ్రవరి 2026 (తెలంగాణ ముచ్చట్లు):** మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ పలు దౌర్జన్యాలకు పాల్పడిందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో డబ్బులు, మద్యం ఏరులై పారించారని, అధికారాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు.

మిగతా 2లో..

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్: పొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# రేవంత్ ప్రభుత్వంపై ధర్మపురి అరవింద్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు ఇప్పటికే ఛీకొడుతున్నారని, కార్పొరేటర్లను ఎత్తుకెళ్లే ప్రయత్నాలు చేస్తే మరింత ప్రతికూలత ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ కార్పొరేషన్ ఫలితాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే ఎక్కువ స్థానాలు బీజేపీ గెలుచుకుందని తెలిపారు. తన పార్లమెంట్ పరిధిలో కూడా బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లు సాధించామని వెల్లడించారు. కాంగ్రెస్ లౌకిక వాద పార్టీ కాదని, ఓ బ్రోకర్ పార్టీగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని అరవింద్ ఆరోపించారు. తమ పార్టీ అభ్యర్థులను పోలింగ్ బూత్‌ల నుంచి పంపించారని, వారిపై కేసు పెట్టాలని తాను భావించగా పోలీసులే తనపై కేసు నమోదు చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పోలీసులు సూచించారనే ఆరోపణలు కూడా చేశారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఎత్తుకెళ్లేందుకు కాంగ్రెస్‌కు పోలీసులు సహకరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు రాజకీయాలను భ్రష్టు పట్టించారనే కారణంతో ఓడించారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి అదే దారిలో నడుస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో హుందాతనం అవసరమని, ఎవరికి మద్దతు ఇవ్వాలనేది కార్పొరేటర్ల స్వేచ్ఛ అని అన్నారు. బలవంతపు రాజకీయాలు సరికాదని హెచ్చరించారు. కరీంనగర్‌లో బండి సంజయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటిందని ప్రశంసించారు.

## హైదరాబాద్ కేబీఆర్ పార్క్‌లో డాగ్ అడాప్షన్ కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి)

అవి దాడి చేయడం సాధారణంగా ప్రేరేపణ వల్లేనని, సరైన సంరక్షణ, ప్రేమ, ఆహారం అందిస్తే అవి మన కుటుంబ సభ్యుల్లా మారతాయని చెప్పారు. వీధి కుక్కలను దూరం చేయడం కంటే దత్తత తీసుకుని సంరక్షించాలనే దృక్పథం సమాజంలో పెరగాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో పెరుగుతున్న వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం దత్తత, సంరక్షణ ద్వారానే సాధ్యమని నిర్వాహకులు తెలిపారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ కనీసం ఒక జంతువును దత్తత తీసుకుని ప్రేమతో పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నగరంలో జంతు సంక్షేమంపై సానుకూల చర్చకు దారితీసింది.




## సంగారెడ్డి ఘటనపై పోలీసు సంఘాల మౌనం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటనపై ఇప్పటివరకు ఎలాంటి అరెస్టులు జరగలేదని, పోలీసు సంఘాలు మరియు ఐఏఎస్–ఐపీఎస్ అసోసియేషన్లు స్పందించలేదని ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ విషయంపై తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి వ్యాఖ్యలపై సంఘాలు వెంటనే స్పందించాయని, ఇప్పుడు మౌనం ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే ఈ ఘటనపై దృష్టి సారించి బాధిత పోలీసులకు న్యాయం చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధిత అధికారులతో మాట్లాడి భరోసా ఇవ్వాలని కోరుతున్నారు. ఈ ఘటన పోలీసు వ్యవస్థ ప్రతిష్టకు మచ్చ కాదా అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. పోలీసుల మనోబలాన్ని దెబ్బ తీసే సంఘటనలపై ప్రభుత్వం, సంబంధిత సంఘాలు స్పష్టమైన వైఖరి వెల్లడించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. విధుల్లో ఉన్న అధికారులను అవమానించడం సమాజానికి తప్పుడు సందేశమని పేర్కొంటూ, నిష్పాక్షిక దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

## కామ్రేడ్ నల్లమల కమలాదేవి కన్నుమూత

- సీపీఐ అగ్రనేత గిరిప్రసాద్ సతీమణి మృతి
- జూబ్లీహిల్స్‌లో భౌతిక కాయానికి నివాళులు
- మహాప్రస్థానంలో సాయంత్రం అంత్యక్రియలు
- కూనంనేని సంతాపం

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** సీపీఐ అగ్రనాయకులు కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్ సతీమణి నల్లమల కమలాదేవి (87) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆమె మరణంతో వామపక్ష వర్గాల్లో విషాదం నెలకొంది. నల్లమల కమలాదేవి భౌతిక కాయాన్ని ఇవాళ సాయంత్రం 4 గంటల వరకు జూబ్లీహిల్స్‌లోని ఆమె పెద్ద కుమార్తె నివాసంలో సందర్శనార్థం ఉంచనున్నారు. బంధువులు, పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు నివాళులు అర్పించనున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కమలాదేవి మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు. ఆమె తన భర్త గిరిప్రసాద్ పోరాటంలో అనునిత్యం భాగస్వామ్యమై ఆయనకు అండగా నిలిచారని గుర్తుచేశారు. కుటుంబ సభ్యులతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్నారు. వామపక్ష ఉద్యమాలకు మౌనంగా తోడ్పాటునందించిన వ్యక్తిగా కమలాదేవిని పలువురు స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని నాయకులు ఆకాంక్షించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు : తలసాని ఆరోపణ

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిందని ఆయన దుయ్యబట్టారు. దొంగ హామీలతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని పాలన సాగిస్తోందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్లలాగా కాంగ్రెస్ గెలిచిందని, అయితే బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి సత్తా చాటారని కొనియాడారు. రాజకీయాల్లో ప్రభుత్వాలు శాశ్వతం కావని, ప్రజలే శాశ్వతమని తలసాని వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్ట్ కూడా నిర్మించలేదని విమర్శించారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి పురుషులకు చార్జీలు పెంచారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని ఆయన పేర్కొన్నారు. నీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించారని, రైతులకు పంట సాయం అందించారని గుర్తుచేశారు. తాను టీడీపీ హయాంలో ఉన్నప్పుడు ఐదు గంటలకంటే ఎక్కువ విద్యుత్ రాకపోయేదని అన్నారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వంలో దెబ్బతిందని, కేసీఆర్ కాలంలో భూముల ధరలు పెరిగాయని పేర్కొన్నారు. సిద్దిపేట అభివృద్ధిలో హరీష్‌రావు పాత్ర కీలకమని ప్రశంసించారు.

## డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు అప్రమత్తంగా ఉండండి

- నకిలీ పోలీసులుగా సైబర్ నేరగాళ్ల కొత్త పన్నాగం
- 'జాగృత్ హైదరాబాద్ – సురక్షిత్ హైదరాబాద్'లో భాగస్వామ్యం కావాలి

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** పోలీసు వేషం చూసి మోసపోవద్దని, వీడియో కాల్ నమ్మి మునిగిపోవద్దని హైదరాబాద్ పోలీసు ఉన్నతాధికారి వి.సి.సజ్జనార్ హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్న విధానంపై అవగాహన కల్పిస్తూ ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా కీలక సూచనలు చేశారు. నకిలీ పోలీసులుగా మారి వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయపెట్టి డబ్బులు దోచుకుంటున్నట్లు తెలిపారు. పోలీసులు ఎప్పుడూ వాట్సాప్ లేదా వీడియో కాల్స్ ద్వారా విచారణ జరపరని, డబ్బులు అడగరని ఆయన స్పష్టం చేశారు. చట్టంలో 'డిజిటల్ అరెస్ట్' అనే పదమే లేదని పేర్కొన్నారు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు భయపడకుండా వెంటనే స్థానిక పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ విభాగానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ప్రజల భయాన్ని ఆయుధంగా మార్చుకుని డబ్బులు దోచుకుంటున్నారని తెలిపారు. వీడియో కాల్స్ ద్వారా నకిలీ ఐడీలు చూపించి బెదిరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద కాల్స్‌ను పట్టించుకోకూడదని సూచించారు. హైదరాబాద్ పోలీసులు చేపట్టిన 'జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన వీడియోను ఇతరులతో పంచుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా జాగ్రత్తగా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ అని అధికారులు స్పష్టం చేశారు.

## భర్త మృతిని తట్టుకోలేక చెరువులో దూకిన మహిళ

- నర్సాపూర్ మండలంలో విషాద ఘటన
- నాలుగు నెలల క్రితం భర్త మృతి
- కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు



**నర్సాపూర్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భర్త మరణాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ చెరువులో దూకి ప్రాణాలు తీసుకుంది. చిన్నచింతకుంట గ్రామానికి చెందిన ఆకుల లక్ష్మీ (58) ఈ దుర్ఘటనకు గురైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై రంజిత్ కుమార్ వివరాల ప్రకారం, లక్ష్మీ భర్త శివరాములు నాలుగు నెలల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి ఆమె తీవ్ర మనోవేదనలో ఉండేదని కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో గ్రామ సమీపంలోని చెరువులోకి వెళ్లిన లక్ష్మీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. చుట్టుపక్కల వెతికిన సమయంలో చెరువు గట్టు వద్ద లక్ష్మీ చెప్పులు కనిపించడంతో అనుమానం వ్యక్తమైంది. వెంటనే చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే చీకటి పడటంతో శుక్రవారం రాత్రి గాలింపు నిలిపివేశారు. శనివారం ఉదయం మళ్లీ చెరువు వద్దకు వెళ్లి చూడగా లక్ష్మీ మృతదేహం ఒడ్డున పడి ఉన్నట్లు గుర్తించారు. తన తండ్రి మరణంతో తీవ్ర మనోవేదనకు గురైన తన తల్లి ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు సాయి తేజ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం

## మున్సిపల్ ఎలక్షన్స్ ట్రైలరే.. అసలు సినిమా ఉంది

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ బంజారాహిల్స్‌లోని జాగృతి కేంద్ర కార్యాలయంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ స్టేట్ కన్వీనర్ అంబటి జోజిరెడ్డి , HMS ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌లతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. తాజా ఎన్నికలు తమ భవిష్యత్తు రాజకీయ ప్రస్థానానికి ఓ 'ట్రైలర్' మాత్రమేనని, అసలు 'సినిమా' ముందుందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కూటమి అద్భుతమైన ప్రతిభ కనబరిచిందని కవిత పేర్కొన్నారు. తాము రాజకీయ పార్టీగా మారబోతున్నామని ప్రకటించిన తక్కువ సమయంలోనే ప్రజలు మమ్మల్ని ఆదరించారని గుర్తు చేశారు. జాగృతి, ఫార్వర్డ్ బ్లాక్ కలిసి పోటీ చేసిన అభ్యర్థుల్లో 40 మంది విజయం సాధించారు. ముఖ్యంగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో మాకు స్పష్టమైన మెజార్టీ లభించిందని ఆమె వెల్లడించారు.

అధికారికంగా 33 స్థానాలు వచ్చినప్పటికీ, మరో 7 చోట్ల బీ ఫామ్ సాంకేతిక కారణాల వల్ల స్వతంత్రులుగా గెలిచింది కూడా తమ అభ్యర్థులేనని కవిత స్పష్టం చేశారు.

గతంలో 90 శాతం మున్సిపాలిటీలను గెలుచుకున్న బీఆర్ఎస్, ఇప్పుడు కేవలం 16 స్థానాలకే పరిమితమైందని కవిత అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపడంలో ఆ పార్టీ పూర్తిగా విఫలమైందని కామెంట్ చేశారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ నేతలు పరోక్షంగా సహకరించారని, ఇది ఆ రెండు పార్టీల పొత్తుకు తొలిమెట్టు అని ఆరోపించారు. కూనంనేని సాంబశివరావు కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ మీద చేసిన ఆరోపణలను ఇప్పుడు సీపీఐకి మద్దతు ఇవ్వడం ద్వారా బీఆర్ఎస్ అంగీకరిస్తోందా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిందని, చాలా చోట్ల రీకౌంటింగ్ పేరుతో అధికార దుర్వినియోగానికి పాల్పడిందని విమర్శించారు. ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారని, కానీ త్వరలోనే జాగృతి ఆ లోటును భర్తీ చేస్తుందని జోస్యం చెప్పారు. బీజేపీ కరీంనగర్ మేయర్ తప్ప ఎక్కడా గెలవలేదని, కేంద్ర మంత్రి బండి సంజయ్ (Bandi Sanjay) రూ.30 కోట్లు ఖర్చు చేసినా ఓడిపోయారని కవిత ఎద్దేవా చేశారు.

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ స్టేట్ కన్వీనర్ అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్‌లో బీజేపీ గెలవడానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ రూ.30 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులను బెదిరించి పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, కానీ తమ అభ్యర్థులు లొంగరని జోజిరెడ్డి స్పష్టం చేశారు. అనంతరం హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. రానున్న సింగరేణి ఎన్నికల్లో హెచ్ఎంఎస్, తెలంగాణ జాగృతి, ఫార్వర్డ్ బ్లాక్ కలిసి పనిచేస్తాయని ప్రకటించారు. కార్మికుల హక్కుల కోసం పనిచేసేది తామేనని, అధికార పార్టీ నేతల బెదిరింపులకు భయపడేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్ సెంట్రల్ కమిటీ మెంబర్ ఆర్.వి.ఆర్ ప్రసాద్, జాగృతి ప్రధాన కార్యదర్శులు ఎల్. రూప్ సింగ్, నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## వడ్డేపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డితో కౌన్సిలర్ల చర్చ

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ కు చెందిన 8 మంది కౌన్సిలర్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తదితరులు హాజరయ్యారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై చర్చించినట్లు సమాచారం.

సీఎంను కలిసిన వడ్డేపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లలో కుర్వ పావని (1వ వార్డు), శారద (2వ వార్డు), మంజుల (4వ వార్డు), యుగేందర్ రెడ్డి (5వ వార్డు), దేవమ్మ (6వ వార్డు), విజయ్ భాస్కర్ (7వ వార్డు), జయశ్రీ (8వ వార్డు), ఎరుకల తిమ్మప్ప (10వ వార్డు) ఉన్నారు. జిల్లా అభివృద్ధి, మున్సిపల్ సమస్యల పరిష్కారం, ప్రజా అవసరాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశం సానుకూల వాతావరణంలో ముగిసినట్లు వర్గాలు పేర్కొన్నాయి.

## పురపోరులో పొంగులేటి మ్యాజిక్ 70 % సక్సెస్ రేటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యర్థుల బలమైన కోటలుగా భావించిన ప్రాంతాల్లోనూ పార్టీ విజయపథంలో దూసుకెళ్లడం గమనార్హం. మొత్తంగా మంత్రి పొంగులేటి ప్రచారం నిర్వహించిన 249 వార్డుల్లో 174 స్థానాల్లో విజయం సాధించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. రేవంత్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన కృషి ఫలితమే ఈ విజయమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఫలితాలతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ పురపాలికల్లో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించినట్లు స్పష్టం అయింది.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై జనసేన ప్రెస్ మీట్

- రెండు చోట్ల విజయంతో బోణీ
- మూడొందలకు పైగా అభ్యర్థుల పోటీ
- రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలపై దృష్టి

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యిన అనంతరం హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూడొందలకు పైగా జనసేన అభ్యర్థులు పోటీలో నిలిచారని తెలిపారు. మంచిర్యాల్ కార్పొరేషన్ 34వ డివిజన్‌లో జనసేన అభ్యర్థి అగ్గు సాగర్ 31 ఓట్ల మెజార్టీతో గెలిచారని, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలో 14వ వార్డు నుండి ఆరూరి విజయలక్ష్మి నాగేశ్వరరావు 29 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారని వెల్లడించారు.

తెలంగాణలో జరిగిన ఈ ఎన్నికల్లో పార్టీకి ఓటు వేసిన ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తక్కువ సమయంలో పార్టీ శ్రేణులు, నాయకులు, వీర మహిళలు ఎంతో కష్టపడి పని చేశారని, పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. రెండు చోట్ల సాధించిన విజయంతో రాష్ట్రంలో పార్టీ బోణీ కొట్టిందని పేర్కొన్నారు. తెలంగాణ ఇంచార్జి నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ గెలిచిన అభ్యర్థులకు, బలంగా పనిచేసిన నాయకులకు, ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో మరింత బలంగా పోటీ చేస్తామని చెప్పారు. పార్టీ రాష్ట్ర నాయకుడు రాదారం రాజలింగం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాష్ట్ర నాయకత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. ఆర్కే సాగర్, ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పార్టీని గుర్తించి ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వీర మహిళ చైర్మన్ కావ్య మండపాకతో పాటు ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# తన ఇంటి బిడ్డగా భావించి గెలిపించారు

- ఐదో వార్డు కౌన్సిలర్ హకీమ్ పాషా



**సత్తుపల్లి, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం వెలువడిన ఫలితాల్లో ఐదో వార్డు కౌన్సిలర్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హకీమ్ పాషా 82 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనకు ఈ అవకాశం కల్పించిన సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్‌కు రుణపడి ఉంటానని తెలిపారు. వార్డు ప్రజలు ప్రతి ఒక్కరూ తన ఇంటి బిడ్డగా భావించి, తన గెలుపు కోసం అహర్నిశలు శ్రమించారని, పోటీలో నిలవాలని ప్రోత్సహిస్తూ తనకు అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో వార్డులోని సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని, ప్రతి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కార దిశగా కృషి చేస్తానని చెప్పారు. తనతో పాటు గెలుపొందిన ఇతర కౌన్సిలర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వనపర్తి మునిసిపాలిటీలో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులకు శుభాకాంక్షలు

-- డిఎస్ మహేష్ వనపర్తి జిల్లా నాయకులు



**వనపర్తి,ఫిబ్రవరి14(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి మునిసిపాలిటీలో గెలుపొందిన అభ్యర్థులకు జిల్లా నాయకుడు డిఎస్ మహేష్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మాట్లాడుతూ మునిసిపల్ పరిధిలో మొత్తం 33 వార్డుల్లో కాంగ్రెస్ 21 స్థానాలు గెలుచుకుందని తెలిపారు. ఇతర పార్టీల అభ్యర్థులు మిగతా స్థానాల్లో గెలిచారని పేర్కొన్నారు.వనపర్తి ప్రజలు ఇచ్చిన తీర్పుతో మరింత బాధ్యతతో పని చేస్తామని తెలిపారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని తెలిపారు.తెలంగాణ ప్రజలు పార్టీకి ఇచ్చిన మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే సంవత్సరాల్లో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతాయని తెలిపారు .ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జాతీయ పర్యవేక్షకురాలు మీనాక్షి నటరాజన్ కు ధన్యవాదాలు తెలిపారు.అలాగే స్థానిక నాయకత్వం సహకారంతో అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని తెలిపారు.ఎమ్మెల్యే మేఘారెడ్డి, ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, ఓటు వేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని తెలిపారు.



# అల్టిట్యూడ్ హైస్కూల్లో పుల్వామా అమర వీరులకు ఘన నివాళి

**ఎల్కతుర్తి. ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

ఎల్కతుర్తి మండలంలోని అల్టిట్యూడ్ హైస్కూల్‌లో పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు ఘనంగా నివాళులు అర్పించారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా అమర వీరుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి, రెండు నిమిషాల మౌనం పాటించారు. ఉపాధ్యాయులు 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కశ్మీర్‌లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి గురించి విద్యార్థులకు వివరించారు. దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల త్యాగస్ఫూర్తి ప్రతి భారతీయుడు ఎప్పటికీ మరవకూడదని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, “దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమర జవాన్లు మనందరికీ ఆదర్శప్రాయులు. వారి త్యాగం వలననే మనం ప్రశాంతంగా జీవిస్తున్నాం. విద్యార్థులు చిన్నప్పటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం అలవరచుకోవాలి. అమర వీరుల స్ఫూర్తిని జీవితాంతం గుర్తుంచుకోవాలి” అని తెలిపారు.



విద్యార్థులు దేశభక్తి గీతాలు పాడుతూ అమర వీరుల సేవలను స్మరించుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తాయని పాఠశాల యాజమాన్యం తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నవీన్, వైస్ ప్రిన్సిపాల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయులు కర్రే తిరుపతి, సరితా, లావణ్య, ఆశా బేగం, కృష్ణా, రమేష్, సరిత, శ్రావణి, శ్వేత, స్వప్న, కవిత, మమత,అనుష, గీత, కావ్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.





# ఈశాన్య ప్రాంతంలో తొలి ఆరు లేన్ వంతెన ప్రారంభం

- బ్రహ్మపుత్రపై కుమార్ భాస్కర్ వర్మ సేతు ప్రారంభం
- గౌహతి–ఉత్తర గౌహతి మధ్య ప్రయాణ సమయం తగ్గింపు
- ఆర్థిక వృద్ధికి కొత్త దిశగా కీలక మౌలిక వసతి
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

**అస్సాం, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఈశాన్య ప్రాంతంలో తొలి ఆరు లేన్ వంతెనగా నిలిచిన కుమార్ భాస్కర్ వర్మ సేతును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. అస్సాంలోని బ్రహ్మపుత్ర నదిపై నిర్మించిన ఈ విస్తృత వంతెన ప్రాంతీయ రవాణా సదుపాయాలకు కొత్త ఊపును తీసుకురానుంది. ఆధునిక సాంకేతికతతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ ఈశాన్య భారత అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. గౌహతి మరియు ఉత్తర గౌహతి మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ఇప్పటివరకు ఎక్కువ సమయం పట్టే ఈ మార్గం ఇప్పుడు కేవలం ఏడు నిమిషాల్లో పూర్తయ్యేలా మారింది. దీనివల్ల రవాణా సౌలభ్యం పెరిగి, వాణిజ్య కార్యకలాపాలు వేగవంతం కానున్నాయి. స్థానిక ప్రజలకు, వ్యాపారులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా మారనుంది.

బ్రహ్మపుత్ర నదిపై నిర్మించిన ఈ వంతెన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తోంది. ఈశాన్య రాష్ట్రాలను దేశ ప్రధాన ప్రవాహంతో మరింత సమగ్రంగా కలుపుతూ ప్రాంతీయ అనుసంధానాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మౌలిక వసతుల రంగంలో చేపడుతున్న భారీ పెట్టుబడులు ప్రాంత అభివృద్ధికి దోహదపడతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తితో అస్సాం రాష్ట్రానికి కొత్త ఆర్థిక అవకాశాలు తెరుచుకోనున్నాయి. రవాణా సౌలభ్యం, పారిశ్రామిక వృద్ధి, ఉపాధి అవకాశాలు పెరగడంతో ఈశాన్య ప్రాంతం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# చిన్న పత్రికలపై చిన్న చూపు తగదు

- ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్
- 17న "ఛలో సమాచార భవన్"కు పిలుపు



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 14(తెలంగాణ ముచ్చట్లు)**

కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు ఎంప్యానల్‌మెంట్ తో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన "ఛలో సమాచార భవన్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార పౌరసంబధాల కమిషనర్ కార్యాలయం(సమాచారభవన్) ఎదుట జరిగే జర్నలిస్టుల నిరసన కార్యక్రమంలో వివిధ పత్రికల నిర్వహకులు,

జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు, చానళ్ళకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్దతిని తుంగలో తొక్కి పత్రికలకు ఎంప్యానల్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న,మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ స్వరాష్ట్రంలోనే చిన్న మధ్య తరహా పత్రికలకు, వాటిలో పని చేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగుతుందని మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా...అనేక పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారనని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మబలికిన పాలకులు మీడియా అక్రిడిటేషన్ ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సందర్భాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే అడ్వర్టయిజ్మెంట్ తో పాటు అక్రెడిటేషన్ ఇచ్చే వారని, ప్రస్తుతం అడ్వర్టయిజ్మెంట్ల సంగతి దేవుడెరుగు గానీ...కనీసం అక్రెడిటేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వివక్ష కారణంగా స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, దీని వల్ల ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులకు పత్రికల నిర్వహణ భారమవుతుందని అన్నారు. దీనికి తోడు మూలిగే నక్కమీద తాటికాయపడ్డట్టు ఎంప్యానల్‌లో ఉన్న పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించడం చాలా భాదాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి పత్రికకు అక్రిడిటేషన్ కార్డులు గతంలో మాదిరిగా ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆయా పత్రికలకు ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని, ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఏదులాపురం చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలి

- అధిక సీట్లు.. ఎక్కువ ఓట్లు కలిగి ఉన్నవి మాదిగలవే
- విలేకరుల సమావేశంలో ఎం ఆర్ పి ఎస్ జిల్లా కార్యదర్శి కనకం జనార్ధన్ మాదిగ విజ్ఞప్తి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 14(తెలంగాణ ముచ్చట్లు)**

ఏదులాపురం చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వు చేయబడిందని, ఏదులాపురం మున్సిపల్ ఎన్నికలలో ఎస్సీ మాదిగలు నాలుగు సీట్లు గెలుచుకున్నారని, ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు సభ్యులు గెలుపొందారని అధిక స్థానాలు దక్కించుకున్న మాదిగలకు చైర్మన్ పదవి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ , ఎం ఎస్ పి జిల్లా కార్యదర్శి, ఖమ్మం రూరల్ మండల ఇన్చార్జి కనకం జనార్ధన్ మాదిగ కోరారు.

ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏదులాపురం మున్సిపాలిటీలోనూ, పాలేరు నియోజకవర్గంలోనూ జిల్లాలోను అటు రాష్ట్రంలోనూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటు బ్యాంకింగ్ జనాభా అత్యధికంగా ఉందని, రిజర్వేషన్ల ప్రాతిపదికన తమ సామాజిక వర్గానికి ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉందని, కానీ జరుగుతున్న పరిణామాలు అందుకు భిన్నంగా ఆందోళనకరంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలలో ఎక్కువ స్థానాలు మాదిగ సామాజిక వర్గానికి చెందినవారు గెలుపొందారని అటువంటి వారికి కాదని మరొకరికి కట్ట పెట్టాలనే ప్రయత్నాలు మంచిది కాదని అన్నారు.



రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మాదిగ సామాజిక వర్గం అక్కున చేర్చుకొని అండదండగా నిల్చారని, ఏ ఎన్నిక వచ్చిన, పార్టీకి ఎంత కష్టం వచ్చినా దశాబ్దాల తరబడి వెన్నంటే నిలిచారని అటువంటివారిని కాదని మరొక సామాజిక వర్గానికి ఇవ్వాలనే ప్రయత్నాలు మంచి పరిణామం కాదని అన్నారు.

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని న్యాయబద్ధంగా మాదిగలకు దక్కే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్ల లోను, ఓటు బ్యాంకింగ్ లోను, జనాభా లోను మున్సిపల్ ఎన్నికల్లో అధిక స్థానాలు మాదిగ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులే విజయం సాధించారని అటువంటి వారికే చైర్మన్ పదవి కేటాయించాలని కోరారు.


ఈ సందర్భంగా ఎస్సీ ఉపకులం డక్కల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్నే రామారావు మాట్లాడుతూ.. ఏదులాపురం మున్సిపాలిటీ అదేవిధంగా పాలేరు నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు రిజర్వేషన్ల ప్రాతిపదికన మాదిగలకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దయతో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# పశుపతినాథ్ దేవస్థానం దశమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభం

**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామంలోని శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో దశమ వార్షికోత్సవ వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ సదా నిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ స్వామివారి అనుగ్రహంతో ఉత్సవాలు విజయవంతంగా ఆరంభమయ్యాయని తెలిపారు. స్వామివారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, రుద్రహోమం వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. రుద్రహోమ కార్యక్రమాన్ని విజయ భావనారుషి, సుశీల రత్నాకర్ రావు దంపతులు నిర్వహించారు.



అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణతో పాటు అన్నప్రసాదం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ శ్వేతా శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్ గంజి భావన ఋషి, ఉప సర్పంచ్ అంబల అనిల్ కుమార్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తుల హర్షధ్వానాల మధ్య ముగిశాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# దివ్య కాంతులతో వెలుగుతున్న శ్రీ వేంకటేశ్వర ఆలయం

## బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం





**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈనెల 16న అంకురార్పణతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 26వ తేదీ వరకు వైభవంగా నిర్వ హించనున్నారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం దివ్య కాంతులతో అలంకరించబడింది. ఆలయం లోపల, వెలుపల, నాలుగు మాడ వీధులు, పుష్కరిణి, కార్ పార్కింగ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రంగురంగుల విద్యుత్ తోరణాలు, పుష్పాలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేశారు. తాగునీరు, పార్కింగ్, భద్రత, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టారు.లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు ఏ. వెంకటేశ్వర రెడ్డి, టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యూ. రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు.బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక ఉత్సాహంతో కళకళలాడుతోంది.



# కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ కిటకిట

**కీసర, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**



మేడ్చల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజు ఆలయానికి భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడింది.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు క్యూలైన్లు, తాగునీటి సదుపాయాలు, పార్కింగ్ ఏర్పాట్లు వంటి ప్రత్యేక చర్యలు చేపట్టారు. భద్రతా పరంగా పోలీసు సిబ్బందిని మోహరించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.





# కీసరగుట్టలో సేవా కార్యక్రమాలు చేపట్టిన మన్నె సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్ట్

**కీసర, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా మన్నె సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు చేపట్టింది. ట్రస్ట్ చైర్మన్ నాగఫణీంద్ర ఆధ్వర్యంలో ఆలయ పెయింటింగ్ పనుల నిర్వహణకు రూ.2,50,000 విరాళంగా అందజేశారు. బ్రహ్మోత్సవాల భాగంగా నిర్వహిస్తున్న క్రీడోత్సవాలకు రూ.5 లక్షల విలువైన బహుమతులు, నగదు పురస్కారాలు అందించేందుకు ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమని ఆలయ అధికారులు తెలిపారు. అదేవిధంగా స్వామివారి సేవలో భద్రతా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి 10 క్వింటాళ్ల బియ్యం అందజేయగా, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి 3 క్వింటాళ్ల బియ్యం సమకూర్చారు.భక్తుల సౌకర్యార్థం 10,000 మంచినీటి బాటిళ్లను పంపిణీ చేయనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ నాగఫణీంద్ర తెలిపారు. ట్రస్ట్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమాలను భక్తులు, స్థానికులు ప్రశంసించారు.



# పుల్వామా దాడిలో మరణించిన అమరవీరులకు నివాళులు

**హసన్ పర్తి,ఫిబ్రవరి 14 తెలంగాణ ముచ్చట్లు:**

హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలోని యుపిఎస్ పాఠశాలలో శనివారం రోజున జమ్మూ కాశ్మీర్ జిల్లాలోని పుల్వామా జిల్లాలో 2019 ఫిబ్రవరి 14న 40 మంది సిఆర్పిఎఫ్ జవాన్ లు ప్రయాణిస్తున్న బస్సుపై జెన్షే మమ్మద్ ఉగ్రవాదులు మరొక వాహనంతో ఢీ కొట్టి దాడి చేయడం జరిగింది. ఈ దాడిలో 40 మంది సిఆర్పిఎఫ్. జవానులు వీరమరణం పొందారు వారి ఆత్మకు శాంతి చేకూరాలని పాఠశాలలో కరాటే శిక్షణలో భాగంగా ప్రతి విద్యార్థిని వారికి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. శ్రీధర్ ,పి .శ్రీహరి ,ఏ .కుమారస్వామి . కే.యాకయ్య,జీవి. విష్ణుమూర్తి,బి. రఘువీర్.బీ.మహేందర్,ఎస్.రమాదేవి కరాటే మాస్టర్ రేణుకుంట్ల దుర్గాప్రసాద్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





# ఘనంగా దేవాలయ కళ్యాణ మండపం ప్రారంభం.!

- **ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల**
- **దాతగా దాసరి వెంకటరామిరెడ్డి**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

స్థానిక మండలంలోని బి గంగారం గ్రామం 15వ బెటాలియన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించబడిన దేవాలయ కళ్యాణ మండపాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రిని కమాండెంట్ ఏ. అంజయ్య పుష్పగుచ్ఛంతో సాదరంగా ఆహ్వానించారు. మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించి కళ్యాణ మండపాన్ని అధికారికంగా ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. మండపాన్ని పూలతో అందంగా అలంకరించారు.


ఈ కళ్యాణ వేదిక నిర్మాణానికి దాతగా గంగారం గ్రామం దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టి నాయన) మరియు ఆయన కుమారుడు దాసరి మధుమోహన్ రెడ్డి విశేష సహకారం అందించారు. వారి ఉదార సహకారంతో నిర్మించబడిన ఈ వేదిక బెటాలియన్ సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యుల శుభకార్యాలు, వివాహాలు మరియు ఇతర సామాజిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడనుంది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజ సేవాభావంతో ముందుకు వచ్చి ఇలాంటి శ్రేయోభిలాషి కార్యక్రమాలకు సహకరించిన దాతలను అభినందించారు. సిబ్బంది సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన ఈ వేదిక భవిష్యత్తులో ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ బి. వేణుగోపాల్ రెడ్డి, ఆర్.ఐలు రామ సత్యనారాయణ, ఉదయ్ కుమార్, ఆర్.ఎస్.ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. దాతలను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం

**పెద్దమందడి,ఫిబ్రవరి14 (తెలంగాణ ముచ్చట్లు):**



పెద్దమందడి మండలంలోని గ్రామపంచాయతీలలో ఇటీవల నిర్వహించిన రెండవ సాధారణ ఎన్నికలలో గెలుపొందిన నూతన వార్డు సభ్యుల కోసం 5 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ పరిణతి తెలిపారు. ఈ శిక్షణ ఫిబ్రవరి 16 నుంచి 20, 2026 వరకు కొనసాగుతుందని, ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పెద్దమందడిలోని రైతు వేదికలో నిర్వహిస్తామని వెల్లడించారు.ఈ శిక్షణలో భాగంగా గ్రామపంచాయతీ పరిపాలన విధానం, ప్రభుత్వ సంక్షేమ మరియు అభివృద్ధి పథకాల అమలు, గ్రామ నిధుల సరైన వినియోగం, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, గ్రామ అభివృద్ధి ప్రణాళికలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు.నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధిలో సమర్థవంతంగా పని చేయేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు.అల్వాల, అమ్మపల్లి, బుగ్గపల్లి తాండా, చిన్నమందడి, మోజర్ల దొడ గుంటపల్లి, గట్ల ఖానాపూర్, జగత్‌పల్లి, మద్దిగట్ల, మనిగిళ్ల మరియు పెద్దమందడి గ్రామం గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు ఈ శిక్షణలో తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు. మొదటి విడతలో మొత్తం 10 గ్రామాలకు చెందిన 106 మంది వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయి పాలనలో నాణ్యత పెంపు సాధ్యమవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆధునిక జీవితంలో అంతరించిపోతున్న సంబంధాలు

## అభివృద్ధి మధ్య ఆప్యాయతకు ముప్పు

**ఇరవై ఒకటవ శతాబ్దం మానవ జీవితంలో అపూర్వమైన మార్పులను తెచ్చింది. ముఖ్యంగా Facebook, Instagram, WhatsApp వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రపంచం ఒక చిన్న గ్రామంలా మారిపోయింది. ఒక బటన్ నొక్కితే సమాచారం మన చేతుల్లోకి వస్తోంది. సాంకేతిక పురోగతి, ఆర్థికాభివృద్ధి, ప్రపంచ వ్యాప్త అనుసంధానం వలన జీవన సౌకర్యాలు పెరిగాయి.**

**అయితే ఒక కీలక ప్రశ్న మన ముందుంది**



**– జయరాజ్**
**సామాజికవేత్త**
**చైర్మన్, కారుణ్య స్వచ్ఛంద సేవా సంస్థలు, తెలంగాణ**

సౌకర్యాలు పెరిగిన కొద్దీ మనుషుల మధ్య ఆప్యాయత కూడా పెరిగిందా?

వాస్తవానికి భౌతికంగా దగ్గరైన మనుషులు భావోద్వేగంగా దూరమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఒకే ఇంట్లో నివసించే వారు పరస్పరం మాట్లాడకుండా చేతి ఫోన్లలో మునిగిపోతున్నారు. భోజన సమయాల్లో సంభాషణల స్థానంలో నిశ్శబ్దం నెలకొంటోంది. ఇది కేవలం కుటుంబ సమస్య మాత్రమే కాదు; సమాజ నిర్మాణానికే ఒక హెచ్చరిక.

**డిజిటల్ ప్రపంచం – వాస్తవ సంబంధాలకు సవాలు**

సామాజిక మాధ్యమాలు పరిచయాలను పెంచాయి. వందలాది పరిచయస్తులు ఉన్నా, మనసు విప్పి మాట్లాడగలిగే నిజమైన స్నేహితులు తగ్గిపోతున్నారు. ఊహా ప్రపంచంలోని సంభాషణలు పెరిగినా, ప్రత్యక్షంగా కలిసే సందర్భాలు తగ్గుతున్నాయి. భావాలను ప్రతీకల రూపంలో వ్యక్తపరచడం అలవాటై, ప్రత్యక్ష భావ వ్యక్తీకరణ తగ్గిపోతోంది.

**వ్యక్తికేంద్రీకరణ పెరుగుదల**

"నా జీవితం – నా నిర్ణయం" అనే భావన బలపడింది. వ్యక్తిగత స్వేచ్ఛ అవసరమే. కానీ అది కుటుంబ బంధాలను విస్మరించే స్థాయికి చేరితే సమస్యలు మొదలవుతాయి. సంయుక్త కుటుంబ వ్యవస్థలు క్రమంగా తగ్గిపోతున్నాయి. పెద్దల అనుభవం, మార్గదర్శకత్వం రెండవ స్థానంలోకి వెళ్లిపోతున్నాయి.

**సమయాభావం – అనుబంధానికి అడ్డంకి**

పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ పనులలో నిమగ్నమై ఉన్నారు. ఉపాధి, సంపాదన, స్థిరత్వం కోసం నిరంతర ప్రయత్నం జరుగుతోంది. అయితే కుటుంబ సభ్యులతో గడిపే సమయం తగ్గిపోతోంది. జీవనోపాధి కోసం సమయం వెచ్చిస్తున్నా, జీవన విలువల కోసం సమయం కేటాయించడంలో లోపం కనిపిస్తోంది.

**తారతమ్య భావాలు – విభేదాలకు కారణం**

ఆర్థిక స్థితి, విద్య, సామాజిక స్థాయి ఆధారంగా ఒకరిని ఒకరు అంచనా వేయడం పెరిగింది. పోలికలు అసూయను పెంచుతాయి; అసూయ విభేదాలకు దారి తీస్తుంది. సంబంధాల కంటే స్థాయి, ప్రతిష్ఠలకు ప్రాధాన్యం పెరగడం అనుబంధాన్ని దెబ్బతీస్తోంది.

**సహనశక్తి తగ్గుదల**

ప్రస్తుతం తక్షణ ఫలితాల సంస్కృతి పెరిగింది. సంబంధాల్లో చిన్న సమస్య వచ్చినా చర్చించకుండా దూరమవ్వడం సాధారణమవుతోంది. క్షమాభావం తగ్గిపోవడం వల్ల బంధాలు నిలకడగా ఉండడం కష్టమవుతోంది.

**పరిష్కార మార్గాలు**

1. నాణ్యమైన సమయం కేటాయింపు
రోజుకు కొంత సమయం కుటుంబంతో గడపాలి. భోజన సమయంలో ఫోన్లను పక్కన పెట్టి పరస్పరం మాట్లాడుకోవాలి.

2. పరస్పర గౌరవం
భిన్నాభిప్రాయాలు సహజం. కానీ గౌరవం ఉన్న చోటే సంబంధం నిలుస్తుంది.

3. స్పష్టమైన సంభాషణ
అపార్థాలు మౌనంతో పెరుగుతాయి. మాట్లాడుకోవడం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయి.

4. సహనం మరియు క్షమాభావం
ప్రతి మనిషి తప్పులు చేస్తాడు. క్షమించడం నేర్చుకుంటే బంధాలు బలపడతాయి.

5. విలువల బోధన
పిల్లలకు చిన్నప్పటి నుంచే కుటుంబ విలువలు, పెద్దలను గౌరవించడం, సహానుభూతి వంటి లక్షణాలు నేర్పాలి. పిల్లలు చూసి నేర్చుకుంటారు; అందుకే పెద్దలు ఆదర్శంగా ఉండాలి.

**ముగింపు**

ఆధునిక జీవితం ఎంత వేగంగా మారుతున్నా ప్రేమ, విశ్వాసం, అనుబంధం వంటి విలువలు శాశ్వతమైనవి. సాంకేతికత మనకు సౌకర్యాన్ని ఇస్తుంది; కానీ నిజమైన ఆనందం మాత్రం సంబంధాల ద్వారా మాత్రమే లభిస్తుంది.

సంపాదించాలి — కానీ మనుషులను కోల్పోకూడదు.

మాట్లాడాలి — వినాలి — కలిసుండాలి.

సంబంధాలు బలంగా ఉంటే వ్యక్తి బలపడతాడు; వ్యక్తి బలపడితే కుటుంబం బలపడుతుంది; కుటుంబం బలపడితే సమాజం, దేశం కూడా బలపడుతుంది.

# మున్సిపల్ పోరులో కాంగ్రెస్ జైత్రయాత్ర

- కాంగ్రెస్ విజయంతో విపక్షాలకు చెక్
- ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభంజనం
- మున్సిపల్ ఫలితాలపై పీసీసీ సభ్యుడు జావేద్ స్పందన

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 13(తెలంగాణ ముచ్చట్లు)**



మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయకేతనం ఎగురవేయడంపై పీసీసీ సభ్యుడు మహ్మద్ జావేద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ గెలుపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ప్రజలు ఇచ్చిన తిరుగులేని తీర్పు అని ఆయన అభివర్ణించారు.

శుక్రవారం స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ఎన్నికల ఫలితాలపై తన విశ్లేషణను పంచుకున్నారు.

**సంక్షేమ పథకాలకే ఓటరు పట్టం**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఇంటికి చేరువయ్యాయని జావేద్ పేర్కొన్నారు.

"ప్రజా ప్రభుత్వ విధానాలను ప్రజలు మనస్ఫూర్తిగా ఆదరించారు. అందుకే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టారు," అని ఆయన అన్నారు. గెలుపొందిన వార్డు సభ్యులకు అభినందనలు తెలుపుతూ, ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

**విపక్షాల కుట్రలు సాగవు**

ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా, ప్రజలు మాత్రం అభివృద్ధి మరియు వాస్తవాల వైపే నిలిచారని జావేద్ స్పష్టం చేశారు. అనవసర ఆరోపణలు, విమర్శలు పక్కన పెట్టి, ఇప్పటికైనా ప్రతిపక్ష నేతలు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.

**కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ఇదే జోరు**

వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గాలి రాష్ట్రవ్యాప్తంగా వీస్తోందని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.






# సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్ జన్మదిన వేడుకలు

**కుషాయిగూడ, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్ (సీఎం) జన్మదిన వేడుకలు శనివారం కుషాయిగూడలోని శ్రీరామ్ బ్రేకర్స్ అండ్ స్వీట్స్ ఫంక్షన్ హాల్‌లో ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చంద్రమోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్, బీఆర్ఎస్ నాయకుడు గంప కృష్ణ గుప్తా తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

వక్తలు మాట్లాడుతూ సమాజానికి అంకితభావంతో పనిచేస్తున్న చంద్రమోహన్ సేవలను కొనియాడారు. "నిజాయితీ, నిబద్ధత, ప్రజాపక్ష ధోరణి కలగలిపిన జర్నలిజానికి మెరుగు చంద్రమోహన్ గారు ఆదర్శం" అని పేర్కొన్నారు.మూడున్నర దశాబ్దాలుగా విలువలతో కూడిన జర్నలిజాన్ని కొనసాగిస్తూ యువ పాత్రికేయులకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నారని ప్రశంసించారు.కేక్ కటింగ్ అనంతరం అభిమానులు, సహచరులు ఆయనకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.ఈ వేడుకలకు పలువురు రాజకీయ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు తన్నీరు శ్రీనివాస్, వాసు, బెలిదే అశోక్, శనిగరం అశోక్, వెంకట్, కీర్తి శ్రీనివాస్, యవాపురం రవి, పటేల్ నరసింహ, ఆంజనేయులు, యాట రాజు, రవి యాదవ్, రియాజ్, వెంకటాపురం రవి, నరసింహ, రామచంద్ర మూర్తి, బాలకృష్ణ గౌడ్, సింగం రాజు, నరేష్, దొమ్మాటి కిరణ్ కుమార్, మోహన్ రెడ్డి, హుస్సేన్, చిత్తారి, విష్ణు మోహన్, సాగర్ తదితరులు హాజరయ్యారు.






# కీసర గుట్టకు ప్రత్యేక బస్సులను ప్రారంభించిన రీజినల్ మేనేజర్ సుచరిత

- ఆలయం సమీపం వరకు నేరుగా బస్సుల సౌకర్యం

**కీసర, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంకు భక్తుల రాకపోకలు సౌకర్యవంతంగా ఉండేందుకు ప్రత్యేక బస్సులను ప్రారంభించారు. సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సుచరిత ఈ ప్రత్యేక సర్వీసులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నాలుగు డిపోల పరిధిలో మొత్తం 330 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్, ఈసీఐఎల్, వెంకటాపురం, ఉప్పల్, అఫ్జల్గంజ్ తదితర ప్రాంతాల నుండి నేరుగా ఆలయ సమీపం వరకు బస్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రతి 10 నిమిషాలకు సర్వీసులు నడిపేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని కూడా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు పవిత్ర, అపర్ణ కళ్యాణి, చోహన్, కుషాయిగూడ డిపో మేనేజర్ వేణుగోపాల్, కంటోన్మెంట్ డిపో మేనేజర్ సుధాకర్, రాణిగంజ్ డిపో మేనేజర్ శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్లు చంద్రమౌళి, శ్రీపతి, కృష్ణ, ఆనంద్ రావు, ఎంఎఫ్ వ్యాసు, ఎస్టీఐలు, సూపర్వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.





# గ్రామీణ వైద్యులకు అండగా ఉంటాం..

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగేందర్

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 14(తెలంగాణ ముచ్చట్లు)**

పేద ప్రజలకు 24 గంటలు 365 రోజులు అందుబాటులో ఉండే గ్రామీణ వైద్యులకు అండగా ఉంటానని కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకులు తుమ్మల యుగేందర్ అన్నారు. ఖమ్మం పట్టణంలో ని మంచికంటి ఫంక్షన్ హాల్లో ఆర్ఎంపిడబ్ల్యూఏ 10వ జిల్లా మహాసభ జిల్లా అధ్యక్షుడు బొమ్మినేని కొండలరావు అధ్యక్షతన జరిగిన సభకి ముఖ్యతిధిగా హాజరై మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పేదలకు అందిస్తున్న ఆర్ఎంపిలపై దాడులు ఆపాలని ప్రభుత్వాలను కోరారు.

**సామాజిక చైతన్యం పై అవగాహన ఉండాలి...**
**స్పర్శ సామాజిక అధ్యయన వేదిక కె భాస్కర్...**

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా 10 వ మహాసభకు స్పర్శ సామాజిక అధ్యయన వేదిక కె భాస్కర్ హాజరైయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు వైద్యమే కాకుండా ప్రతి ఆర్ఎంపి సామాజిక చైతన్యం పై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఆర్ఎంపి లకు స్పర్శ సామాజిక అధ్యయన వేదిక ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

**ఐక్యంగా పోరాడుదాం..**
**పంగా మల్లేశం రాజమౌళి..**

ఆర్ఎంపి వ్యవస్థ రోడ్డు న పడే పరిస్థితి నేడు దాపురించిందని ఐక్యంగా పోరాడకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని గ్రామీణ వైద్యుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పంగా మల్లేశం స్టీరింగ్ కమిటీ మెంబర్ మిట్టపల్లి రాజమౌళి లు అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంసీ టిజిఎంసీ లు కలిసి సంయుక్తంగా మనపై చేస్తున్న దాడులను అరికట్టాలంటే ముందు మనమంతా ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని కోరారు. పరిమితికి మించి వైద్యం చేస్తున్నామనే సాకుతో మనపై వివిధ రూపాల్లో దాడులు జరుగుతున్నాయని గుర్తుచేశారు. అదేవిధంగా జిల్లా అధ్యక్షకార్యదర్శులు బొమ్మినేని కొండలరావు బోయినపల్లి శ్రీనివాస్ రావు లు మాట్లాడుతూ మహాసభని విజయవంతం చేసిన ఆర్ఎంపిడబ్ల్యూఏ సభ్యులకు మహాసభకు ఆర్థిక సహకరం అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కె క్రిష్ణ మూర్తి రాష్ట్ర కమిటీ సభ్యులు ఐ నారాయణ రావు కొంగర గోపి బండి కొమరయ్య జిల్లా కొశాధికారి హసన్ ఉపాధ్యక్షులు జెడి మూర్తి ప్రచార కార్యదర్శి గండరాపు రామారావు షేక్ నాగుల్ మీరా మురహరి ఖాసీం మాధవరెడ్డి రహీం వెంకటరమణ అక్కినపల్లి నాగేశ్వర రావు పుల్లారెడ్డి గౌతమ్ బాలు కిషోర్ భాస్కర్ క్రిష్ణమోహన్ రమేష్ కాంతారావు కనకరావు శ్రీరాములు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బాధ్యులు పర్సగాని నాగేశ్వరరావు దావా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# నాగారంలో సిల్వర్ కమలమ్మ మృతి... కుటుంబానికి ఆర్థిక సాయం

**నాగారం, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ నియోజకవర్గం ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ నాగారం ప్రాంతంలో ప్రతిరోజూ ఉదయం ఇడ్లీలు అమ్ముకుంటూ జీవనం సాగించిన సిల్వర్ కమలమ్మ శివ ఐక్యమయ్యారు. ఆమె మృతి స్థానికులను కలిచివేసింది. కష్టపడి కుటుంబాన్ని పోషించిన కమలమ్మ మృతిపై ప్రజలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ చైర్మన్ చంద్రారెడ్డి , మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ , మాజీ కౌన్సిలర్ అనంత్ రెడ్డి కమలమ్మ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.అంత్యక్రియల ఖర్చుల కోసం ముగ్గురు కలిసి రూ.20,000 ఆర్థిక సాయం అందజేశారు.అదే విధంగా బండారి మల్లేష్ యాదవ్ రూ.5,000 ఆర్థిక సహాయం చేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కమలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని వారు ఆకాంక్షించారు.స్థానికులు ఆమె సేవలను స్మరించుకుంటూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# గట్టు మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో శివరాత్రి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్సై సురేష్

**వేలేరు, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని ప్రసిద్ధి చెందిన గట్టుమల్లికార్జున స్వామి దేవస్థానం వద్ద ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించనున్న శివరాత్రి వేడుకల నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను పరిశీలించింది. పండుగ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి.

వేలేరు తహసీల్దార్ కోమి మరియు ఎస్సై సురేష్ పర్యవేక్షణలో దేవస్థానం పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

దేవాలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. త్రాగునీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.శివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, రాత్రి జాగరణ, అభిషేకాలు నిర్వహించనున్నారు. భక్తులు నియమ నిబంధనలు పాటిస్తూ వేడుకల్లో పాల్గొనాలని అధికారులు కోరారు.

# తెలంగాణ హ్యూమన్ రైట్ జస్టిస్ ఫోరమ్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా సూరారం కావేరి ఎన్నిక

**మేడ్చల్ మల్కాజిగిరి, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ కోసం కార్యకలాపాలు నిర్వహిస్తున్న తెలంగాణ హ్యూమన్ రైట్ జస్టిస్ ఫోరమ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా సూరారం కావేరిని నియమించినట్లు సంస్థ చైర్పర్సన్ డా. వ్యాసభట్ శ్రీవాణి చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు జిల్లాలో మానవ హక్కుల ఉద్యమాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో ఈ నియామకం చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు.ఈ నియామకంపై స్పందించిన సూరారం కావేరి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన చైర్పర్సన్ డా. వ్యాసభట్ శ్రీవాణి చౌదరికి, అలాగే నియామకానికి కృషి చేసిన తెలంగాణ ప్రధాన కార్యదర్శి జట్ల పద్మావతికు కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పని చేస్తామని, బాధితులకు అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సంస్థ అభివృద్ధి కోసం సద్వ్యవస్థాపకతతో పనిచేస్తామని, హక్కులు భంగమయ్యే ప్రతి సందర్భంలో తెలంగాణ హ్యూమన్ రైట్ జస్టిస్ ఫోరమ్ తరఫున గట్టిగా స్పందిస్తామని తెలిపారు. ఈ నియామకం తన సామాజిక బాధ్యతను మరింత పెంచిందని ఆయన అన్నారు .ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు, స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు నూతనంగా నియమితులైన మేడ్చల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సూరారం కావేరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మహాశివరాత్రి హిందువులకు అత్యంత పవిత్రమైన పండుగ

- జిల్లా సాహితి కళావేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్

**వనపర్తి,ఫిబ్రవరి14(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.ఈ సందర్భంగా భక్తులు ఉపవాసం, జాగరణ, శివనామస్మరణతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.జిల్లాలో సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల నిర్వహణలో భాగంగా మహాశివరాత్రి హిందువులకు అత్యంత పవిత్రమైన పండుగ అని తెలిపారు. ఈ పండుగ మాఘ మాస కృష్ణ పక్ష చతుర్దశి నాడు జరుపుకుంటారని పేర్కొన్నారు.అలాగే సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాలు వనపర్తి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.పురాణాల ప్రకారం పరమశివుడు హాలాహలం విషాన్ని మింగి లోకాన్ని రక్షించిన రాత్రిగా, అలాగే శివపార్వతుల వివాహ మహోత్సవంగా మహాశివరాత్రికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ రోజు భక్తులు బిల్వపత్రాలతో రుద్రాభిషేకాలు చేసి శివారాధన చేస్తారు.మహాశివరాత్రి రాత్రి జాగరణ చేసి శివారాధన చేయడం ద్వారా ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందని, పాపాలు నశిస్తాయని భక్తుల విశ్వాసం. శివుడు అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే దైవంగా భావించబడతాడు. మహాశివరాత్రి సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# మల్లికుదుర్లలో గట్టుమల్లికార్జున స్వామి దేవస్థానం నూతన పాలక వర్గ కమిటీ ఎన్నిక

**వేలేరు, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో ప్రసిద్ధి చెందిన గట్టుమల్లికార్జున స్వామి దేవస్థానానికి నూతన పాలకవర్గ కమిటీ ఎన్నికైంది. ఆలయ అభివృద్ధి, నిర్వహణ, భక్తులకు సౌకర్యాల విస్తరణ లక్ష్యంగా ఈ కమిటీ ఏర్పాటైంది. ఆలయ కమిటీ చైర్మన్‌గా పల్లె నిరంజన్ రెడ్డి నియమితులయ్యారు. డైరెక్టర్లుగా పిండి బాలకొమురయ్య, కురుసపెల్లి ప్రేమానందం, మెరుగు కోమాల, కొలను ఒగ్గు రాజకుమార్, కోతి సాంబరాజులు నియామకమయ్యారు.



ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, భక్తులు మరియు పలువురు ప్రముఖులు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆకాంక్షించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడేలా కమిటీ కృషి చేయాలని సూచించారు



# కేటీఆర్, హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన పాండాల శివకుమార్ గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట్ ఎమ్మెల్యే టి హరీష్ రావులను శనివారం వారి నివాసంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పాండాల శివకుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో నేతలను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఈ నెల 22వ తేదీన చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీలో నిర్వహించనున్న తన నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.దీనికి స్పందించిన కేటీఆర్, హరీష్ రావులు శుభాకాంక్షలు తెలుపుతూ, కార్యక్రమానికి హాజరు కావడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేమూరి మహేష్ గౌడ్, బుచ్చన్న, శ్రీకాంత్ రెడ్డి, గూడూరి మహేష్ గౌడ్, శంకర్, రమేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



# హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణకు రూ.30 కోట్లు

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు

**నాచారం, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గంలోని హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల కోసం రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయించడంతో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డికు నాచారం డివిజన్ పుర ప్రముఖులు, హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ సంఘ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే




మాట్లాడుతూ, చెరువులోని నీటిని పూర్తిగా బయటకు పంపించి త్వరలోనే సుందరీకరణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. చెరువు పరిసర ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు నడక మార్గాలు, విశ్రాంతి వేదికలు వంటి సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.అలాగే నాచారం ప్రాంతంలో దోమల సమస్యను పూర్తిగా నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పటేల్ కుంట చెరువును కూడా ఖాళీ చేసి కూడిక తీత పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, భూపాల్ రెడ్డి, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, జయరాజ్, రామ్ కోటేశ్వరరావు, యాదగిరి రెడ్డి, కిషన్, సుభాస్కర్, బాల్‌రెడ్డి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ గ్లోబల్ జెన్ స్కూల్‌లో ఘనంగా వార్షిక క్రీడా దినోత్సవం

**నాగారం, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

శిల్పానగర్‌లోని విజ్ఞాన్ గ్లోబల్ జెన్ స్కూల్‌లో వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల క్రీడా కేకలతో కిటకిటలాడింది.

ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి అడిషనల్ డీసీపీ డాక్టర్ సంధ్యాల నరసింహారెడ్డి పాల్గొని బెలూన్లు ఎగురవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని, క్రీడలు ఆ దిశగా కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. దేశం మనకేమి ఇచ్చిందనే దానికంటే దేశానికి మనం ఏమి ఇస్తున్నామనే భావనతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులు పిరమిడ్స్, టైక్వాండో, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, కబడ్డీ, లాంగ్ జంప్, షాట్‌పుట్, స్కేటింగ్ వంటి విభిన్న క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ సైక్లిస్ట్ సంస్థ ఫౌండర్ రవీందర్ నందనూరి విశిష్ట అతిథిగా పాల్గొని సైక్లింగ్ ప్రయోజనాలను వివరించారు.విజేతలకు పతకాలు, ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కె. సరితా రెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ రాణి రుద్రమా దేవి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.










# అమరవీరుల కుటుంబాలకు దేశం ఎప్పటికి ఋణం పడి ఉంటుంది

**వరంగల్ ఎంపి కడియం కావ్య**

**వరంగల్,ఫిబ్రవరి14(తెలంగాణ ముచ్చట్లు):**

పుల్వామా అటాక్ లో అమరులైన 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను స్మరించుకుంటూ ఫిబ్రవరి 14ను 'బ్లాక్ డే'గా పాటించారు. మాజీ కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. హనుమకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ సిగ్నల్ పాయింట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ర్యాలీలో ఎంపీ పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. కొవ్వొత్తుల వెలుగులో జవాన్ల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా డా.కడియం కావ్య మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన జవాన్ల త్యాగం, దేశభక్తి ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచిపోతాయని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని తెలిపారు. కొవ్వొత్తుల వెలుగుతో అమరుల జ్ఞాపకాలను స్మరించుకుంటూ వారి అజేయ ఆత్మస్థైర్యానికి వందనం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం

# ముంబైలో కూలిన మెట్రో పిల్లర్


- రోడ్డుపై వాహనాలపై పడిన నిర్మాణ స్తంభం
- ఒకరు మృతి, నలుగురికి గాయాలు
- ట్రాఫిక్ స్తంభనతో ములుండ్‌లో కలకలం

**ముంబై, 14 ఫిబ్రవరి 2026 (తెలంగాణ ముచ్చట్లు):** మహారాష్ట్ర రాజధాని ముంబై నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్ అకస్మాత్తుగా కూలిపోవడంతో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. ములుండ్ ప్రాంతంలోని ఎల్బీఎస్ రోడ్ సమీపంలో, జాన్సన్ అండ్ జాన్సన్ ఫ్యాక్టరీ వద్ద నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో శనివారం మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కూలిన పిల్లర్ రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై పడటంతో తీవ్ర నష్టం సంభవించింది. ప్రమాద సమయంలో అక్కడుగా వెళ్తున్న ఒక ఆటో రిక్షా, ఒక కారుపై మెట్రో పిల్లర్ పడింది. దీంతో వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వాహనాల్లో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. మరో నలుగురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ముంబై మెట్రోపాలిటన్ రీజన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు, బీఎంసీ అధికారులు, మెట్రో సంస్థ ప్రతినిధులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారికి పూర్తిస్థాయి వైద్య సహాయం అందిస్తామని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు.



ఈ ఘటనతో ములుండ్ ప్రాంతంలో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# ప్రియురాలిని హత్య చేసి, సెప్టిక్ ట్యాంక్‌లో మృతదేహం



**భోపాల్, 14 ఫిబ్రవరి 2026 (తెలంగాణ ముచ్చట్లు):** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో సంచలన ఘటన చోటుచేసుకుంది. వివాహితుడైన వ్యక్తి తన ప్రియురాలిని హత్య చేసి, మృతదేహాన్ని ఇనుప ట్రంక్ పెట్టెలో పెట్టి సెప్టిక్ ట్యాంక్‌లో పడేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. కమలా నగర్ ప్రాంతానికి చెందిన సమీర్‌కు ఇప్పటికే వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాది క్రితం మహారాష్ట్రలోని గోండియా జిల్లాకు చెందిన 33 ఏళ్ల అష్రఫీ అలియాస్ సియా సామాజిక మాధ్యమాల ద్వారా అతనికి పరిచయమైంది. ఆ పరిచయం వివాహేతర సంబంధంగా మారినట్లు పోలీసులు తెలిపారు. మూడు నెలల క్రితం సియా మహారాష్ట్ర నుంచి భోపాల్ చేరుకుని సమీర్ ఇంట్లోనే నివసించడం ప్రారంభించింది. ఆమెను స్నేహితురాలిగా కుటుంబ సభ్యులకు పరిచయం చేసినట్లు సమాచారం. అనంతరం తనను పెళ్లి చేసుకోవాలని సియా సమీర్‌పై ఒత్తిడి తెచ్చింది. ఈ విషయమై సమీర్ భార్యతో ఘర్షణలు ప్రారంభమయ్యాయి. పరిస్థితులు విషమించడంతో సమీర్ భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇదే సమయంలో సియా, సమీర్ మధ్య గొడవలు మరింత పెరిగాయి. తనను వివాహం చేసుకోవాలని లేకపోతే ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని సియా డిమాండ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఫిబ్రవరి 9 సాయంత్రం ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహంతో సమీర్ సియాను గొంతునొక్కి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం మృతదేహాన్ని పారవేయడానికి తన తల్లి, సోదరుడు, సోదరితో కలిసి కుట్ర పన్నాడు. సియా మృతదేహాన్ని ఇనుప ట్రంక్ పెట్టెలో ఉంచి అర్ధరాత్రి సమయంలో నిషాత్‌పురా ప్రాంతంలోని ఖాళీ స్థలంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో పడేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఫిబ్రవరి 12న ఖాళీ స్థలంలో ఆడుకుంటున్న పిల్లలు సెప్టిక్ ట్యాంక్ నుంచి దుర్వాసన వస్తున్నట్లు గమనించి పెద్దలకు తెలిపారు. స్థానికులు పరిశీలించగా ట్యాంక్‌లో ఇనుప పెట్టె కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పెట్టెను బయటకు తీసి తెరిచారు. అందులో కుళ్లిన మహిళ మృతదేహం లభించింది. శరీరంపై ఉన్న టాటూ, పుట్టిన తేదీ ఆధారంగా సియాగా గుర్తించారు. ప్రధాన నిందితుడు సమీర్‌తో పాటు అతనికి సహకరించిన కుటుంబ సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినం

**డెస్క్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** పిల్లల నవ్వు ప్రతి ఇంటి ఆనందానికి ప్రతీక. ఆ నవ్వు క్రమంగా మసకబారడం ఒక కుటుంబానికి మాత్రమే కాదు, సమాజానికి చెందిన బాధ. బాల్య క్యాన్సర్ అనే పదం వినగానే భయం కలుగుతుంది. కానీ భయంతో కాదు, అవగాహనతో ఈ వ్యాధిని ఎదుర్కోవాలి. పిల్లల్లో కనిపించే క్యాన్సర్ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం కల్పించడం, ముందస్తు గుర్తింపు ప్రాధాన్యాన్ని తెలియజేయడం, సరైన చికిత్స అందుబాటులో ఉండేలా చూడడం, బాధిత కుటుంబాలకు మానసిక-ఆర్థిక మద్దతు కల్పించడం ఇవే అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినం ఉద్దేశాలు. బాల్య క్యాన్సర్‌ను చాలా మంది అరుదైన వ్యాధిగా భావిస్తారు. కానీ వాస్తవం అంత సులభం కాదు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది పిల్లలు వివిధ రకాల క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. రక్త క్యాన్సర్, మెదడు గడ్డలు, లింఫోమా వంటి రకాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. లక్షణాలు ప్రారంభ దశలో స్పష్టంగా కనిపించకపోవడం వల్ల తల్లిదండ్రులు ఆలస్యంగా గుర్తించే ప్రమాదం ఉంది. తరచూ జ్వరం రావడం, అసాధారణ వాపులు, బలహీనత, రక్తహీనత, ఆకలి తగ్గడం వంటి సూచనలను నిర్లక్ష్యం చేయకూడదు. ముందస్తు పరీక్షలు, వైద్యుల సలహా ప్రాణాలను కాపాడగలవు.




- చిన్నారి ప్రాణం – సమాజానికి అమూల్యమైన బాధ్యత
- ముందస్తు గుర్తింపు, సమయానుకూల చికిత్స – ఆశకు మార్గం
- ఆర్థిక భారం, మానసిక వేదన – కుటుంబాల పోరాటం
- అవగాహన, పరిశోధన, సమగ్ర మద్దతు – సమిష్టి కర్తవ్యం

చికిత్స ఖరీదైనది, దీర్ఘకాలికం. నెలలు, కొన్ని సందర్భాల్లో సంవత్సరాలపాటు చికిత్స కొనసాగాల్సి ఉంటుంది. ఇది కుటుంబాలకు ఆర్థికంగా పెద్ద భారం. మధ్యతరగతి, పేద కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. చికిత్స ఖర్చులు, ఆసుపత్రి వసతి, ఔషధాలు, ప్రయాణ ఖర్చులు కలిపి కుటుంబాన్ని తీవ్ర ఒత్తిడిలోకి నెడుతున్నాయి. అందుకే ప్రభుత్వ ఆరోగ్య పథకాలు బలోపేతం కావాలి. ప్రతి పిల్లవాడికి సమాన చికిత్స అందేలా వైద్య సదుపాయాలు గ్రామీణ ప్రాంతాల వరకూ విస్తరించాలి.

బాల్య క్యాన్సర్ కేవలం శారీరక వ్యాధి కాదు. అది మానసిక పరీక్ష కూడా. చిన్న వయసులోనే పిల్లలు ఆసుపత్రి గదుల్లో రోజులు గడపాల్సి వస్తోంది. పాఠశాల, స్నేహితులు, ఆటల దూరమవుతున్నాయి. ఇది వారి భావోద్వేగ స్థితిపై ప్రభావం చూపుతుంది. కాబట్టి కౌన్సిలింగ్, మానసిక మద్దతు, విద్యా సౌకర్యాలు అవసరం. ఆసుపత్రుల్లో పిల్లలకు సానుకూల వాతావరణం కల్పించాలి. కుటుంబ సభ్యులకు కూడా ధైర్యం ఇవ్వాలి.

అవగాహన కార్యక్రమాలు మరింత విస్తరించాలి. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, గ్రామ సభలు వేదికలుగా ఉపయోగించాలి. అపోహలను తొలగించాలి. క్యాన్సర్ అంటే అంతమని భావించే దృక్పథం మారాలి. సమయానికి గుర్తిస్తే చికిత్సతో నయం కావచ్చని ప్రజల్లో నమ్మకం పెంచాలి. పరిశోధనలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. తక్కువ ఖర్చుతో చికిత్స అందించే విధానాలను అభివృద్ధి చేయాలి. సమాజం కూడా బాధ్యత వహించాలి. బాధిత కుటుంబాలను ఒంటరిగా వదిలేయకుండా సహాయం చేయాలి. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలి. రక్తదానం, అవయవ దానం, ఆర్థిక సహాయం వంటి మార్గాల ద్వారా సహకారం అందించాలి. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా జీవించాలి అన్న సంకల్పం సమాజంలో బలపడాలి.

అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినం మనకు ఒక గాఢమైన సందేశాన్ని ఇస్తుంది. చిన్నారి ప్రాణం అమూల్యం. ఆ ప్రాణాన్ని కాపాడడం మన సమిష్టి బాధ్యత. అవగాహనతో, సమగ్ర వైద్య సేవలతో, మానసిక మద్దతుతో ఈ వ్యాధిని ఎదుర్కోవచ్చు. ఆశను నింపే చర్యలు తీసుకుంటే చిన్నారి నవ్వు మళ్లీ వెలిగుతుంది. మొత్తంగా బాల్య క్యాన్సర్‌పై పోరాటం వైద్య రంగానికే పరిమితం కాదు. అది సమాజం మొత్తం కలిసి చేయాల్సిన యుద్ధం. ప్రతి పిల్లవాడికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు హక్కు. ఆ హక్కును కాపాడడం మనందరి కర్తవ్యం. అదే ఈ దినం మనకు గుర్తు చేసే అసలు సత్యం. బాల్య క్యాన్సర్‌ను కేవలం వైద్య సమస్యగా చూడకూడదు. ఇది భావోద్వేగ పరీక్ష కూడా. చిన్న వయసులోనే చికిత్స బాధలు, ఆసుపత్రి జీవితం, పాఠశాల దూరం పిల్లల మానసిక స్థితిపై ప్రభావం చూపుతాయి. అందుకే కౌన్సిలింగ్, కుటుంబ మద్దతు, పాఠశాలల సహకారం అవసరం. చికిత్సతో పాటు ఆశ, ధైర్యం కూడా సమానంగా అవసరం.

అవగాహన కార్యక్రమాలు అత్యంత కీలకం. పాఠశాలలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, సమాజ సంస్థలు కలిసి ప్రజల్లో సమాచారం పంచాలి. అపోహలను తొలగించాలి. ప్రారంభ దశలో వైద్యులను సంప్రదించే అలవాటు పెంపొందించాలి. బాల్య క్యాన్సర్‌పై పరిశోధనలు, మెరుగైన చికిత్సా విధానాలు అభివృద్ధి చెందేందుకు పెట్టుబడులు పెరగాలి.

అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినం మనకు ఒక బాధ్యతను గుర్తు చేస్తుంది. చిన్నారుల ఆరోగ్యం కేవలం కుటుంబ బాధ్యత కాదు. అది సమాజం, ప్రభుత్వం, వైద్య వ్యవస్థ, ప్రతి పౌరుడి బాధ్యత. ప్రతి పిల్లవాడికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు అందించాలంటే సమగ్ర చర్యలు అవసరం.

మొత్తంగా బాల్య క్యాన్సర్‌పై పోరాటం కేవలం వైద్య రంగానికే పరిమితం కాదు. అవగాహన, మద్దతు, సంరక్షణ కలిసినప్పుడే విజయవంతం అవుతుంది. ప్రతి చిన్నారి నవ్వు కాపాడడం మన సమిష్టి కర్తవ్యం. ఆశను నింపే ప్రయత్నం చేయడం మన బాధ్యత. అదే ఈ దినం ఇచ్చే అసలైన సందేశం.

# జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ క్యాన్సర్ కేంద్రాలు

- జిల్లాలకే కీమోథెరపీ సేవలు
- మూడేళ్లలో దేశవ్యాప్తంగా విస్తరణ
- రోగుల ఆర్థిక భారం తగ్గించే నిర్ణయం

**డెస్క్, 14 ఫిబ్రవరి (తెలంగాణ ముచ్చట్లు):** క్యాన్సర్ రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడేళ్లలో దశలవారీగా ఈ కేంద్రాలను ప్రారంభించనుండగా, 202526 ఆర్థిక సంవత్సరంలోనే 200 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చర్యతో కీమోథెరపీ వంటి కీలక చికిత్సలు రోగుల నివాస ప్రాంతాలకు దగ్గరగా అందుబాటులోకి రానున్నాయి. క్యాన్సర్ చికిత్స కోసం రోగులు తరచూ పెద్ద నగరాలకు ప్రయాణించాల్సి వస్తోంది. ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలకు ఇది శారీరకంగా, ఆర్థికంగా తీవ్రమైన భారంగా మారుతోంది. ప్రయాణ ఖర్చులు, బస, ఆహారం, ఉపాధి నష్టాలు వంటి అంశాలు కుటుంబాలను కుంగదీస్తున్నాయి. కీమోథెరపీ తీసుకునే రోగులు బలహీనంగా ఉండటంతో వారికి తోడుగా కుటుంబ సభ్యులు వెళ్లాల్సి రావడం అదనపు భారాన్ని మోపుతోంది. ఈ ఇబ్బందులను దూరం చేసేందుకే ప్రభుత్వం జిల్లాస్థాయిలో డే కేర్ క్యాన్సర్ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ కేంద్రాల ఏర్పాటుకు ముందు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో కలిసి లోటుపాట్లపై సమగ్ర అధ్యయనం నిర్వహించారు. క్యాన్సర్ కేసుల సంఖ్య,



రోగుల భారము, మౌలిక సదుపాయాల లభ్యత ఆధారంగా జిల్లాలను ఎంపిక చేశారు. ఎంపికైన ప్రాంతాల్లోని వైద్యులు, నర్సులకు ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాల్లో 4 నుంచి 6 వారాల పాటు ప్రత్యేక శిక్షణ అందించారు. కీమోథెరపీ మందుల మోతాదు, దుష్ప్రభావాల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం వంటి అంశాల్లో సాంకేతిక పరిజ్ఞానం అందించారు. ఈ డే కేర్ కేంద్రాల ద్వారా అవసరమైన కీమోథెరపీ మందులను ఉచితంగా అందించనున్నారు. క్యాన్సర్ చికిత్సలో మందుల ఖర్చు అధికంగా ఉండే నేపథ్యంలో ఈ నిర్ణయం రోగులపై ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గించనుంది. మందుల కొరత లేకుండా సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తూ, జిల్లాస్థాయిలోనే నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే దిశగా కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ నిర్ణయం గ్రామీణ ప్రాంతాల రోగులకు ముఖ్యమైన ఉపశమనంగా భావిస్తున్నారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ స్పందన

- సంక్షేమ పాలనకు లభించిన ప్రజా తీర్పు
- 116 మున్సిపాలిటీల్లో 64 చోట్ల కాంగ్రెస్ విజయం
- వార్డు స్థాయిలో హస్తం ఆధిపత్యం

**హైదరాబాద్, 14 ఫిబ్రవరి (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో జరిగిన పురపాలక, నగరపాలక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ ఫలితాలు తమ సంక్షేమ పాలనకు, ప్రజల తెలంగాణ నమూనాకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని ఆయన పేర్కొన్నారు. శనివారం 'ఎక్స్' వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ, ఈ విజయాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు మరియు తెలంగాణ ప్రజలకు అంకితం చేశారు. ప్రతి కుటుంబానికీ అభివృద్ధి ఫలాలు అందించాలనే తమ లక్ష్యం పట్ల కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మొత్తం 116 మున్సిపాలిటీలకు గాను కాంగ్రెస్ పార్టీ 64 చోట్ల జయకేతనం ఎగురవేసింది. అలాగే 7 నగరపాలక సంస్థల్లో మూడింటిని కైవసం చేసుకుంది. మంచాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లు కాంగ్రెస్ ఖాతాలో చేరడం పార్టీకి కీలక విజయంగా నిలిచింది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లతో పరిమితమైంది. మరో 38 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించకపోవడంతో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికలు



ఆసక్తికరంగా మారనున్నాయి. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ ఆధిపత్యం ప్రదర్శించగా, ఈసారి బీఆర్ఎస్ పనితీరు గణనీయంగా తగ్గినట్లు ఫలితాలు వెల్లడించాయి. బీజేపీ సొంతంగా ఒక్క మున్సిపాలిటీని గెలవనప్పటికీ, కరీంనగర్, నిజామాబాద్ నగరపాలక సంస్థల్లో అతిపెద్ద పార్టీగా అవతరించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తం 2,582 మున్సిపల్ వార్డులకు గాను కాంగ్రెస్ 1,347 వార్డుల్లో విజయం సాధించగా, బీఆర్ఎస్ 717, బీజేపీ 261 వార్డులను గెలుచుకున్నాయి. బుధవారం జరిగిన పోలింగ్‌లో 73 శాతానికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శుక్రవారం ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక అధికారిక ఫలితాలను ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల భవిష్యత్ దిశను నిర్దేశించనున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఇండిగో విమానంలో బాంబు బెదిరింపు

- టాయిలెట్‌లో లభించిన బెదిరింపు స్లిప్
- ప్రయాణికుల అత్యవసర తరలింపు
- భద్రతా తనిఖీల అనంతరం స్పష్టత

**కోల్‌కతా, 14 ఫిబ్రవరి (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో సంచలన ఘటన చోటుచేసుకుంది. ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్లు బెదిరింపు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం ఉదయం 9.15 గంటలకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌కు బయలుదేరాల్సిన విమానంలో ఈ ఘటన జరిగింది. ప్రయాణికులు ఎక్కిన అనంతరం టాయిలెట్‌లో చేతితో రాసిన బెదిరింపు స్లిప్‌ను సిబ్బంది గుర్తించారు. స్లిప్‌లో బాంబు ఉన్నట్లు పేర్కొనడంతో సిబ్బంది వెంటనే విమానాశ్రయ అధికారులను అలెర్ట్ చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యగా విమానాన్ని ఐసోలేషన్ బే వద్దకు తరలించారు. భద్రతా ప్రోటోకాల్ మేరకు విమానంలోని అన్ని ప్రయాణికులను సురక్షితంగా ఖాళీ చేయించారు. ప్రయాణికులను టెర్మినల్ ప్రాంతానికి తరలించి అదనపు భద్రతా ఏర్పాట్లు చేశారు. భద్రతా దళాలు, బాంబు నిర్వీర్య దళాలు విమానాన్ని పూర్తిగా తనిఖీ చేశాయి. ప్రతి సీటు, సామాను విభాగం, టాయిలెట్ ప్రాంతం సహా అన్ని భాగాలను సోదా చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రాథమికంగా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని సమాచారం. అయితే బెదిరింపు స్లిప్ ఎలా వచ్చింది అన్న దానిపై విచారణ కొనసాగుతోంది. ఇండిగో సంస్థ భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ అధికారులతో పూర్తిగా సహకరించినట్లు వెల్లడించింది. ఈ ఘటనతో విమానాశ్రయంలో కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది. బెదిరింపు వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ప్రయాణికుల భద్రతే తమకు ప్రథమ ప్రాధాన్యత అని అధికారులు స్పష్టం చేశారు.

# సామాజిక న్యాయ సాధనకు అంకితమైన జీవితం

**స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ చరిత్రలో తొలి దళిత ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య జయంతి**

**ప్రజాస్వామ్య బలానికి ప్రతీకగా నిలిచిన మహానేత**

**వెనుకబడిన వర్గాల ఆశాకిరణం**



**డెస్క్, ఫిబ్రవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రజాస్వామ్య చరిత్రలో సామాజిక సమానత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన నాయకుల్లో దామోదరం సంజీవయ్య పేరు ప్రత్యేకంగా నిలుస్తుంది. స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశభక్తి భావంతో ఉద్యమాల్లో పాల్గొని, అనంతరం రాష్ట్ర రాజకీయాల్లో కీలక స్థానాన్ని సంపాదించి, దేశ చరిత్రలో తొలి దళిత ముఖ్యమంత్రిగా అవతరించిన ఆయన జీవితం అనేక తరాలకు స్ఫూర్తి. ఆయన జయంతి సందర్భంగా ఆయన సేవలు, ఆలోచనలు, పోరాటాన్ని స్మరించుకోవడం సమాజానికి అవసరం. సాధారణ కుటుంబంలో జన్మించిన సంజీవయ్య చిన్ననాటి నుంచే కష్టాలను ఎదుర్కొన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గానికి చెందిన వ్యక్తిగా విద్యా, సామాజిక రంగాల్లో అనేక అవరోధాలు ఎదురైనా, పట్టుదలతో ముందుకు సాగారు. విద్యనే ఆయుధంగా చేసుకుని తన ప్రతిభను చాటుకున్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జాతీయ చైతన్యాన్ని పంచారు. దేశం కోసం పనిచేయడం తన ధ్యేయంగా భావించారు.

స్వాతంత్ర్యానంతరం రాజకీయ రంగంలోకి ప్రవేశించిన సంజీవయ్య, ప్రజాసేవను కర్తవ్యంగా స్వీకరించారు. ఆయన నాయకత్వంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన, వెనుకబడిన వర్గాల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం లభించింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు పరిపాలనలో పారదర్శకత, క్రమశిక్షణ, సమానత్వం అనే విలువలను ముందుకు తెచ్చారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. దేశ చరిత్రలో తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆయన ఎదగడం ప్రజాస్వామ్య బలాన్ని చాటింది. సామాజిక అడ్డంకులు ఉన్నప్పటికీ ప్రతిభ, పట్టుదలతో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని ఆయన జీవితం నిరూపించింది. ఆయన సాధన అనేక మందికి ధైర్యాన్ని ఇచ్చింది. వెనుకబడిన వర్గాలకు ఆయన ఆశాకిరణంగా మారారు. సమాజంలో సమానత్వం సాధ్యమని ఆయన నిరూపించారు.

సంజీవయ్య వ్యక్తిత్వంలో వినయం ప్రధాన లక్షణం. పదవులు ఉన్నప్పటికీ ఆయనలో అహంకారం కనిపించలేదు. ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా ఆయన నిలిచారు. రాజకీయాల్లో విలువలు, నైతికత ఉండాలని తన జీవన విధానంతో చూపించారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్న నాయకుడిగా చరిత్రలో నిలిచారు. సామాజిక న్యాయం ఆయన ఆలోచనల కేంద్రబిందువు. విద్య, ఉపాధి, సమాన హక్కులు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలని ఆయన భావించారు. వెనుకబడిన వర్గాల సాధికారతకు విధానపరమైన మార్పులు అవసరమని గుర్తించారు. ఆయన కాలంలో ప్రారంభమైన ఆలోచనలు నేటికీ ప్రాసంగికమే. దామోదరం సంజీవయ్య జీవితం నేటి యువతకు ఒక పాఠం. కష్టాలు ఎంత ఉన్నా పట్టుదలతో ముందుకు సాగితే విజయాన్ని సాధించవచ్చని ఆయన చూపించారు. ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, విలువలు ఎంత ముఖ్యమో ఆయన జీవితమే సాక్ష్యం. పదవి కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయడం నాయకత్వానికి అసలు అర్థమని ఆయన నిరూపించారు. ఈ జయంతి సందర్భంగా ఆయన ఆలోచనలను మళ్లీ గుర్తు చేసుకోవాలి. సమాజంలో సమానత్వాన్ని బలోపేతం చేయడం, వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడం ఇవే ఆయనకు నిజమైన నివాళి. దామోదరం సంజీవయ్య పేరు భారత రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆయన జీవితం సామాజిక న్యాయ సాధనకు మార్గదర్శకంగా తరతరాలకు స్ఫూర్తినిస్తుంది. తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆయన ఎదగడం భారత ప్రజాస్వామ్య బలాన్ని చాటింది. సామాజిక అడ్డంకులను చెరిపేసి ప్రతిభతో ఉన్నత స్థానాన్ని అధిరోహించవచ్చని ఆయన జీవితం నిరూపించింది. ఆయన సాధన అనేక మందికి ధైర్యాన్ని, నమ్మకాన్ని ఇచ్చింది. సమాజంలో సమానత్వం సాధ్యమని చూపిన నాయకుడిగా ఆయన నిలిచారు.

దామోదరం సంజీవయ్య కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు. ఆయన ఒక విలువ. వినయం, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల అంకితభావం ఆయన వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి. ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు.

ఈ జయంతి సందర్భంగా ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు గుర్తు చేసుకోవాలి. సమాజంలో సమాన అవకాశాలు కల్పించడం, వెనుకబడిన వర్గాలను ముందుకు తీసుకురావడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడం—ఇవే ఆయనకు నిజమైన నివాళి. దామోదరం సంజీవయ్య జీవితం సమానత్వం కోసం సాగిన పోరాటానికి ప్రతీకగా చిరస్థాయిగా నిలిచిపోతుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కుర్రాళ్లను కవ్విస్తున్న అనన్య నాగళ్ల..



ఒకప్పుడు దక్షిణాది సినిమాల్లో నటించేందుకు బాలీవుడ్ హీరోయిన్లను తీసుకురావడానికి నిర్మాతలు ప్రయత్నించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పాన్ ఇండియా ట్రెండ్ ప్రభావంతో బాలీవుడ్లో దక్షిణాది హీరోయిన్ల హవా స్పష్టంగా కనిపిస్తోంది. వరుస భారీ చిత్రాల్లో ప్రధాన పాత్రలు దక్కించుకుంటూ సౌత్ హీరోయిన్లు అక్కడ కూడా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు.

ఇప్పటికే నయనతార, తమన్నా, సమంత, రష్మిక మందన్న వంటి స్టార్ హీరోయిన్లు హిందీ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించారు. ఇప్పుడు నూతన తరం హీరోయిన్లు కూడా అదే దారిలో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా సాయి పల్లవి, సారా అర్జున్, శ్రీలీల, భాగ్యశ్రీ బోర్సే, కళ్యాణి ప్రియదర్శన్ లాంటి హీరోయిన్లు వరుస అవకాశాలతో బాలీవుడ్‌లో సందడి చేస్తున్నారు.

ప్రస్తుతం బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న సినిమాల్లో సౌత్ హీరోయిన్ల ప్రాధాన్యం ఎక్కువగా కనిపిస్తోంది. భారీ బడ్జెట్ చిత్రాల్లో ప్రధాన పాత్రలకు దక్షిణాది నటీమణులను ఎంపిక చేయడం అక్కడి దర్శక నిర్మాతల నమ్మకాన్ని చూపిస్తోంది. ఉత్తరాది ప్రేక్షకుల్లో పెరిగిన ఆదరణ కూడా ఈ మార్పుకు ప్రధాన కారణంగా చెబుతున్నారు.

మరోవైపు, భారతీయ సినీ చరిత్రలో భారీ వ్యయంతో రూపొందుతున్న రామాయణ చిత్రంలో సీత పాత్రలో సాయి పల్లవి నటిస్తుండటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించిన శ్రీలీల కూడా హిందీ చిత్రరంగ ప్రవేశానికి సిద్ధమవుతోంది. కార్తీక్ ఆర్యన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రంతో ఆమె బాలీవుడ్‌లో అడుగుపెట్టనుంది.

అలాగే కీర్తి సురేష్ సైతం వరుస ప్రాజెక్టులతో తన మార్కెట్‌ను విస్తరించుకుంటున్నారు. సౌత్‌లో వచ్చిన గుర్తింపుతో మళ్లీ హిందీ సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్న భాగ్యశ్రీ బోర్సే వంటి నటీమణులు కూడా కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు.

భాషా పరిమితులు తగ్గిపోతున్న ఈ సమయంలో భారతీయ సినిమా ఒక్కటిగా మారుతోంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సౌత్ హీరోయిన్ల ప్రభావం రోజురోజుకు పెరుగుతూ ఉండటం పరిశ్రమలో కొత్త ధోరణిగా మారింది.



## విశ్వనాథన్ అండ్ సన్స్'గా సూర్య?

# వైరల్ అవుతున్న టైటిల్!

తమిళ అగ్రనటుడు సూర్య, దర్శకుడు వెంకీ అట్లూరి కలయికలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రంపై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం 'సూర్య 46'గా ప్రచారంలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు 'విశ్వనాథన్ అండ్ సన్స్' అనే శీర్షికను పరిశీలిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ పేరు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాపిస్తోంది.

ఇప్పటికే చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నట్లు సమాచారం. కేవలం కొన్ని రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉండటంతో, నిర్మాతలు తదుపరి పనులపై దృష్టి సారించారు. కథా నేపథ్యం, సూర్య పాత్ర తీరు ఈ చిత్రంలో భిన్నంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, సూర్య నటిస్తున్న మరో చిత్రం 'కరుప్పు' విడుదలైన మూడు నుంచి నాలుగు నెలల తర్వాతే ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. 'కరుప్పు' చిత్రం ఏప్రిల్ 2026లో విడుదలయ్యే అవకాశముండటంతో, ఈ కొత్త చిత్రం జూలై లేదా ఆగస్టు 2026లో ప్రేక్షకుల ముందుకు రావచ్చని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సూర్య-వెంకీ అట్లూరి కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారికంగా శీర్షిక ప్రకటిస్తే అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొనే అవకాశముంది.

## సినిమాలు లేవు.. కానీ సోషల్ మీడియాలో

# ఫుల్ బిజీగా ప్రణీత సుభాష్



నటి ప్రణీత సుభాష్ తెలుగు చిత్రసీమలో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు పొందిన కథానాయికగా నిలిచింది. 'ఏం పిల్లో ఏం పిల్లడో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ భామ తొలి చిత్రంతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. సొగసుతో పాటు సహజమైన నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకుని తక్కువ సమయంలోనే మంచి అవకాశాలను అందుకుంది.

ఆ తర్వాత నటుడు సిద్ధార్థ్ సరసన నటించిన 'బావ' చిత్రం ఆమెకు మరింత పేరు తీసుకొచ్చింది. ఆ చిత్ర విజయంతో వరుసగా అవకాశాలు రావడంతో ప్రణీత తెలుగు చిత్రాల్లో బిజీగా మారింది. కుటుంబ కథా చిత్రాలు, వినోదాత్మక కథలతో కూడిన సినిమాల్లో నటిస్తూ ప్రేక్షకులకు దగ్గరైంది. అందం, అభినయం రెండింటినీ సమతూకంగా చూపిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.

తరువాత కాలంలో పలు భాషల్లో నటించినప్పటికీ, తెలుగులోనే ఆమెకు విశేషమైన ఆదరణ లభించింది. మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, పవన్ కల్యాణ్, రామ్ పోతినేని, మంచు విష్ణు వంటి ప్రముఖ హీరోల సరసన నటించి అభిమానులను అలరించింది. ప్రధాన కథానాయికగా మాత్రమే కాకుండా, కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా స్వీకరిస్తూ తన నటనను చాటుకుంది.

వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రణీత ఇటీవల చిత్రాలకు కొంత విరామం ఇచ్చింది. వివాహం అనంతరం కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉన్న ఆమె ఇద్దరు పిల్లలకు తల్లిగా కొత్త జీవితాన్ని ఆనందంగా సాగిస్తోంది. అయినప్పటికీ ఆమె ఆకర్షణ, శైలి ఏమాత్రం తగ్గలేదని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.

సినిమాలకు దూరంగా ఉన్నా సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో ఎప్పటికప్పుడు అనుసంధానంగా ఉంటోంది. కుటుంబంతో గడిపే క్షణాలు, కొత్త ఫోటోలను పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె పంచుకున్న చిత్రాలు మరోసారి అభిమానుల్లో చర్చకు దారితీసి, సినిమాల్లో తిరిగి ఎప్పుడు కనిపిస్తుందనే ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.




## జానర్ మార్చిన శైలేష్ కొలను.. రోషన్ మేకతో

# రొమాంటిక్ కామెడీ ఫస్ట్ గ్లింప్స్ విడుదల

యువ హీరో రోషన్ మేక, దర్శకుడు శైలేష్ కొలను కలయికలో రూపొందుతున్న తాజా చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే శీర్షికను చిత్ర బృందం ఖరారు చేసింది. ప్రేమికుల దినోత్సవాన్ని సందర్భంగా చేసుకుని ఈ చిత్రానికి సంబంధించిన మొదటి గ్లింప్స్‌ను విడుదల చేశారు.

ఇప్పటివరకు గంభీర నేర కథలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న శైలేష్ కొలను ఈసారి పూర్తిగా భిన్నంగా ప్రేమ-హాస్య కథను ఎంచుకోవడం విశేషంగా మారింది.

విడుదలైన గ్లింప్స్‌లో కథానాయకుడు అభయ్ పాత్రలో కనిపిస్తున్న రోషన్ మేక తన తల్లితో ప్రేమ, నేటి తరం సంబంధాల గురించి చేసే సరదా సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. తేలికపాటి వినోదంతో పాటు భావోద్వేగాలను కలగలిపిన కథగా ఈ చిత్రం ఉండబోతుందనే సంకేతాలు గ్లింప్స్‌లో కనిపిస్తున్నాయి. ఈ సినిమాలో రోషన్ సరసన ప్రీతి ముకుందన్ కథానాయికగా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతాన్ని హేషామ్ అబ్దుల్ వహాబ్ అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా సాగుతుండగా, 2026 దసరా సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నారు.

# ధనుష్‌తో పెళ్లి పుకార్లపై మృణాల్ ఠాకూర్ క్లారిటీ..

## ఏప్రిల్ 1న చేసుకుంటా అంటూ సెటైర్

సినీ రంగంలో పుకార్లు కొత్తవి కావు. నటీనటులు కలిసి ఒక కార్యక్రమంలో కనిపించినా వారిద్దరి మధ్య సంబంధం ఉందంటూ వార్తలు చక్కర్లు కొట్టడం సాధారణమే. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ విషయంలో కనిపించింది. గత కొన్ని రోజులుగా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఒక వ్యక్తిగత కార్యక్రమంలో ఇద్దరూ కలిసి కనిపించడం ఈ పుకార్లకు కారణమైంది. ఆ తర్వాత మృణాల్ నటించిన సినిమా కార్యక్రమానికి ధనుష్ హాజరుకావడంతో ఈ వార్తలు మరింత వేగం పుంజుకున్నాయి. అయితే ఈ ప్రచారంపై తాజాగా మృణాల్ స్పందిస్తూ స్పష్టత ఇచ్చింది.





తన సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా "ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?" అన్న ప్రశ్నకు మృణాల్ నవ్వుతూ, "ఫిబ్రవరి 14 కాదు... ఏప్రిల్ 1న చేసుకుంటానేమో, అది మోసాల రోజు కదా!" అంటూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. ఈ వ్యాఖ్యతో పెళ్లి పుకార్లకు ఆమె సరదాగా చెక్ పెట్టింది. అదే సందర్భంగా ఈ వార్తలు ఎలా మొదలయ్యాయో కూడా తనకు తెలియదని, ఎలాంటి నిజం లేని విషయాలను నిజాలుగా ప్రచారం చేయడం బాధ కలిగిస్తుందని ఆమె పేర్కొంది. తామిద్దరం కేవలం మంచి స్నేహితులమేనని, అంతకుమించి ఏమీ లేదని మరోసారి స్పష్టం చేసింది. దీంతో ధనుష్-మృణాల్ పెళ్లి వార్తలకు పూర్తి స్థాయిలో ముగింపు పలికినట్లైంది.

# హీరోగా దర్శకుడు లోకేష్ కనగరాజ్.. 'డీసీ' గ్లింప్స్ విడుదల

తమిళ చిత్రసీమలో విభిన్నమైన కథన శైలితో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఇప్పుడు నటుడిగా కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నారు. 'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ' వంటి చిత్రాలతో యాక్షన్ ప్రపంచాన్ని కొత్త దిశగా మలిచిన లోకేష్, ఇప్పుడు 'డీసీ' అనే చిత్రంతో హీరోగా ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ ప్రకటనతోనే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ఈ చిత్రానికి అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో చిత్రాలను తెరకెక్కించే సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. లోకేష్ సరసన వామికా గబ్బీ కథానాయికగా నటిస్తున్నారు. సంగీత బాధ్యతలను అనిరుధ్ రవిచందర్ చేపట్టడం విశేషం. ఇప్పటికే ఈ కాంబినేషన్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్రబృందం విడుదల చేసిన 'డీసీ' గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇందులో లోకేష్ కనగరాజ్ గంభీరమైన, తీవ్ర భావోద్వేగాలతో కూడిన లుక్‌లో కనిపిస్తున్నారు.




కఠినమైన శరీర భాష, లోతైన చూపులు, మౌనంలోనే భావాలను వ్యక్తపరచే తీరు ప్రత్యేకంగా నిలిచాయి. సినిమాలో ఆయన దేవదాస్ అనే పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్రలో లోకేష్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించనున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి.

దర్శకుడిగా తనకంటూ ప్రత్యేకమైన విశ్వాన్ని నిర్మించిన లోకేష్, ఇప్పుడు నటుడిగా కూడా అదే స్థాయి ప్రభావం చూపుతారా అన్నదే ప్రధాన చర్చగా మారింది. యాక్షన్, భావోద్వేగాలు, గాఢమైన కథనంతో ఈ చిత్రం రూపొందుతోందని తెలుస్తోంది. గ్లింప్స్‌లో చూపించిన విజువల్ టోన్, నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. దర్శకుడి కుర్చీ నుంచి నటుడి స్థాయికి మారుతున్న లోకేష్ కనగరాజ్ ప్రయాణం ఎలా ఉంటుందో చూడాలని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'డీసీ'తో ఆయన మరోసారి సినీ ప్రపంచంలో సంచలనం సృష్టిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in